ప్రజాశక్తి

మంగళవారం 16 ఏప్రిల్ 2024 8 పేజీలు



తిరుపతి

చిత్తూరు

స్వచ్ఛందమా.. ఒత్తిళ్లా..!

ఒకేరోజు పెద్దసంఖ్యలో వలంటీర్ల రాజీనామాలు

చంద్రగిరిలో 725 మంది రాజీనామా

మళ్లీ అధికారంలోకి వస్తే పోస్టులు పునరుద్ధరణ హామీ

వలంటీర్లు పార్టీకి పనిచేయాలని హుకుం

రాజీనామా చేసిన వారికి రూ.10వేలట..

ప్రజాశక్తి రామచంద్రాపురం / చంద్రగిరి

ఎన్నికల ప్రయోజనాల కోసం ఏర్పాటు చేసుకున్న వలంటీర్లను ఎన్నికల్లో ఎటువంటి పరిస్థితుల్లోనూ ఉపయోగించరాదని, ఎన్నికల విధుల్లో దూరంగా ఉంచాలని, సంక్షేమ పథకాలు సైతం వీరితో పంపిణీ చేయరాదని ఎన్నికల కమిషన్ సీరియస్‌గానే వార్నింగ్ ఇచ్చింది. దీంతో వైసిపి నేతలు రంగంలోకి దిగారు. ఐదేళ్ల పాటు తమకు కేటాయించిన కుటుంబాలకు చాలా దగ్గరగా ఉన్న వలంటీర్లు ఎన్నికల్లో ఉపయోగపడకపోతే కష్టమని భావించారు. 'మీకు ఉద్యోగాలు ఇచ్చింది మేమే.. టిడిపి అధికారంలోకి వస్తే మిమ్మల్ని కొనసాగించరు.. వలంటీర్‌గా ఉంటే వైసిపికి సేవలందించలేరు. కావున ఎన్నికల్లో పార్టీకి పని చేయాలంటే రాజీనామా చేయండి.. స్వచ్ఛందంగా చేస్తున్నామని చెప్పండి. పార్టీకి సేవ చేయండి. మీ సేవలు ఊరికే వద్దు.. ఒక్కొక్కరికి పదివేల చొప్పున ఇస్తాం. తిరిగి మన పార్టీ అధికారంలోకి వస్తే మీ వలంటీర్ పోస్టులను పునరుద్ధరిస్తాం' అని నచ్చజెప్పి, ఒప్పించి, మెప్పించి వైసిపి నేతలు వలంటీర్లపై ఒత్తిడి తెచ్చి రాజీనామా చేయిస్తున్నట్లు సమాచారం. ఈ విధంగానే ఇప్పటికే చంద్రగిరి నియోజకవర్గంలో 725 మంది వలంటీర్లతో రాజీనామాలు

నియోజకవర్గంలో మండలాల వారీగా..

మండలం	వలంటీర్ల సంఖ్య	రాజీనామా సంఖ్య
1. చంద్రగిరి	349	144మంది
2. రామచంద్రాపురం	172	130మంది
3. పాకాల	332	115మంది
4. చిన్నగొట్టిగల్లు	167	106మంది
5. యర్రావారిపాలెం	142	21మంది
6. తిరుపతి రూరల్	900	27 మంది

చేయించారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి గ్రామాలలోని వలంటీర్లను వాహనాల్లో తీసుకొచ్చి రాజీనామాల జాతర చేయించారు. చంద్రగిరి నియోజకవర్గంలోని 96 సచివాలయాల పరిధిలో 2062 మంది వాలంటీర్లు పనిచేస్తుండగా వారిలో 725 మంది వలంటీర్లు సోమవారం సాయంత్రం 5 గంటల వరకు రాజీనామాల జాతర సాగించారు.

– పెళ్లకూరు మండలంలో 24 గ్రామ పంచాయతీల పరిధిలో 13 సచివాలయాల నుంచి మొత్తం 218 మందికి గాను 216 మంది స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి తరువాయి.. 2 లో

ఎక్కడ చూసినా మద్యం మైనింగ్ మాఫియా

చంద్రబాబుతో బహిరంగ పొత్తు.. జగన్మోహన్ బిజెపి తొత్తు

చిత్తూరు జిల్లా ఎన్నికల ప్రచార సభల్లో వైఎస్ షర్మిల



బంగారుపాళ్యంలో వైఎస్ షర్మిల రోడ్డుషో

ప్రజాశక్తి - వెదురుకుప్పం, పలమనేరు

ఇసుక, మట్టి, మైనింగ్ మాఫియాగా చిత్తూరు జిల్లాలో సహజ వనరులను కొల్లగొట్టేశారని, మరోసారి వైసిపికి అధికారం ఇస్తే నదులను సైతం ఇక్కడి ఎంఎల్‌ఎలు మాయం చేసేస్తారని పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల దుయ్యబట్టారు. వైఎస్ షర్మిల బస్సు యాత్ర తొలిరోజు తిరుపతి జిల్లాలో పర్యటించగా, రెండో రోజు చిత్తూరు జిల్లా జీడీనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు నియోజకవర్గాల్లో పర్యటించారు. జీడీనెల్లూరు కాంగ్రెస్ ఎంఎల్‌ఎ అభ్యర్థి దెయ్యాల రమేష్‌బాబును, పలమనేరు నియోజక వర్గంలో శివశంకర్‌ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్వేటినగరం, బంగారుపాళ్యం, పలమనేరు కూడళ్లల్లో ఆమె రోడ్డుషో నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ షర్మిల మాట్లాడుతూ పలమనేరు ఎంఎల్‌ఎ కౌటిల్య నదిలో ఇసుకే లేకుండా దోచేశాడన్నారు. మళ్లీ ఓటేస్తే పలమనేరు ప్రజలను అమ్మేస్తారన్నారు. ప్రాజెక్టులో ఇసుక తవ్వకాల వల్ల తాగడానికి గుక్కెడు నీరు లేకుండా పోయిందన్నారు. పట్టు పరిశ్రమ లబ్ధిదారులు 30వేల మందికి ఇన్సెంటివ్ ఇవ్వకుండా మోసం చేశాడన్నారు. నాలుగున్నరేళ్లు కుంభకర్ణుడిలా సిఎం జగన్మోహన్‌రెడ్డి నిద్రపోయి, ఇపుడు ఆరువేల పోస్టులకు డిఎస్‌సి నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. జగన్మోహన్‌రెడ్డి ఒక చేత్తో నొక్కి, మరో చేత్తో గుంజుకుంటున్నాడన్నారు. స్పెషల్ స్టేటస్ అంటే విస్కీ అని, డిఎస్‌సి అంటే బ్రాందీ అని, మద్యపాన నిషేధం ఎందుకు అమలు చేయలేదో ముఖ్యమంత్రి చెప్పాలన్నారు. చంద్రబాబు, జగన్మోహన్‌రెడ్డిలకు ఎవరికి ఓటు వేసినా పడేది బిజెపి ఖాతాలోనేనన్నారు. రూ.2 లక్షల వరకూ రైతులకు రుణమాఫీ చేస్తామని, మహిళలకు ఏడాదికి లక్ష రూపాయలు సాయం చేస్తామని, ప్రతి పేద కుటుంబానికి ఐదు లక్షలతో పక్కా ఇల్లు కట్టిస్తామని, పదేళ్లు ప్రత్యేక హోదా కల్పిస్తామని, మొదటి సంతకం ఉద్యోగాల భర్తీపై ఉంటుందన్నారు. చెరకు ఫ్యాక్టరీలను పున్ణప్రారంభించి, చెరకు సాగును ప్రోత్సహిస్తామన్నారు. కార్వేటినగరంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు పోటుగారి భాస్కర్, గోవర్ధన్‌రెడ్డి, గౌతమ్‌రాజు, కిషన్ పాల్గొన్నారు. పలమనేరులో సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు ఇండియా ఫోరం అభ్యర్థి శివశంకర్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పలమనేరులో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రారంభం..ప్రచారం..

తిరుపతిలో ఇండియా వేదిక అభ్యర్థి పి.మురళిని గెలిపించాలని కోరుతూ...

8లో

అంబేద్కర్రా.. మన్నించుమా..!

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'హమ్మయ్య మొన్న ఆదివారం ఓ పెద్ద పనైపోయింది.. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి.. ప్రపంచ మేధావి, బాబాసాహెబ్ అంబేద్కర్ పుట్టినరోజు. మొన్నంతా ఆయనను అందరూ పూజించేశాం. ఆయన పుణ్యాన మాకు ఎన్నికల్లో పోటీచేసే రిజర్వేషన్ అవకాశం లభించింది. ఇక రేపటినుంచి అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడిచే పనిలో ఉంటాం. ఎందుకంటే మేం ఏమి చేసినా మమ్మల్ని ప్రశ్నించేవారు ఎవరూ లేరు. ఆయన వారసులైన దళిత బడుగు బలహీన పేదలే కాదు, బూర్జువా రాజకీయ నాయకులు ఎన్నికల సందర్భంగా అత్యుత్సాహం ప్రదర్శించి అంబేద్కర్ విగ్రహాలన్నీ పూలమాలలతో ముంచెత్తారు.. టెంకాయలు కొట్టి, కర్పూరం వెలిగించి అన్నదానం చేసి గొప్ప గొప్ప మీటింగ్‌లు పెట్టి, పెద్దపెద్ద మాటలు మాట్లాడేశాం. రాజ్యాంగానికి తూట్లు పొడిచినా, మనువాదాన్ని తీసుకొచ్చినా మాకేం సంబంధం లేదు. మీపై వివక్ష చూపించినా, మీపై పెత్తందారులు దాడి చేసినా, కులదురహంకార హత్యలు జరిగినా, దేవుని గుడిలోకి మిమ్మల్ని రానివ్వకపోయినా, మీ భూముల్లో పెత్తందారులు పాగా వేసినా మమ్మల్ని మాత్రం అడగొద్దు.. ఈ నెలరోజులూ మా జెండా మోయండి.. సాయంత్రం ఇంటికెళ్లే ముందు ఓ 500 నోటు, ఓ క్వార్టర్ బాటిల్, ఓ బిరియాని ప్యాకెట్ ఇస్తాం. ఈ నెలరోజులూ మీకు 'ఉపాధి హామీ' ఇదే. వచ్చే ఐదేళ్లలో ఉపాధి హామీ ద్వారా మీకు పని కల్పించకపోయినా, బిల్లులు పడకపోయినా, వసతులు లేకపోయినా మాకేం సంబంధం లేదు. ఈ ఎన్నికల్లో సత్యవేడు, గూడూరు, సూళ్లూరుపేట, తిరుపతి ఎంపి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నాం. ఎన్నికలకు ముందు రోజు మీ అమూల్యమైన ఓటుకు 'నోటు' ఇస్తాం. ఆ తరువాత అపుడపుడు సంక్షేమం పేరుతో ఎంతోకొంత మీ అకౌంట్లలో విదిలిస్తాం. గెలిచిన తరువాత మాత్రం మా వెనకుండి మమ్మల్ని గెలిపించిన కార్పొరేట్ శక్తులకు సహజ వనరుల కాంట్రాక్టులన్నీ కట్టబెడతాం. ఎన్నికల పెట్టుబడి పెట్టినందుకు ఆ మాత్రం 'రుణం' తీర్చుకోక తప్పదు. వాళ్లకు ఎదురు తిరిగామంటే వచ్చే ఏడాది సీటివ్వరు. ఈ ఏడాదీ సిట్టింగ్‌లకు రెండు ప్రాంతాల్లోనూ సీట్లు లేకుండా పోయాయి. రిజర్వేషన్ నియోజకవర్గాలన్నింటినీ కార్పొరేట్ శక్తులు వెనకుండి శాసిస్తాయి. తప్పదు.. మహామహులకే తప్పలేదు. 'పెద్దాయన' తలచుకున్నందుకు చిత్తూరు జిల్లా జీడీనెల్లూరు నియోజకవర్గం 'స్వామి'కే సీటు లేకుండా పోయింది. ఆఫ్ట్రాల్ మేం ఎంత? ఏ పార్టీ నుంచి పోటీచేసినా అధినేతల కనుసన్నల్లో పని చేయాల్సిందే. టిడిపి, జనసేన, వైసిపి మూడు పార్టీలూ బిజెపికే కొమ్ముగాస్తున్నాయి. మనువాదాన్ని తీసుకొచ్చినా, భవిష్యత్‌లో రిజర్వేషన్లకే తూట్లు పడినా మేం ఏమి చేయలేని నిస్సహాయులం. రిజర్వేషన్ పుణ్యమా అని విద్యావేత్తలమైనా, పదవులు దక్కించుకుంటున్నా... వివక్షకు అతీతులం కాదు.. అందుకే అంబేద్కర్రా.. మమ్మల్ని క్షమించు.

(మనస్సున్న అభ్యర్థుల మనోగతం)

ప్రజల ప్రాణాలతో మెడికల్ మాఫియా చెలగాటం: కీర్తన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి నగరంలో నకిలీ మందులతో మెడికల్ మాఫియా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందని జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.కీర్తన ధ్వజమెత్తారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల కోటి రూపాయలకు సంబంధించిన నకిలీ మందులు పట్టుబడడం, పట్టుబడిన ప్రాంతాలలో తిరుపతి నగరం కూడా ఉండడం విస్మయానికి గురిచేసిందన్నారు. మార్కెట్లో భారీగా నకిలీ మందులు చలామణిలో ఉన్నా గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన డ్రగ్ కంట్రోల్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారా అని ప్రశ్నించారు. ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే మందులను వెంటనే అరికట్టకపోతే దీని ప్రభావం జనాభా నిష్పత్తి పై పడే ప్రమాదం ఉందన్నారు. కూటమి పార్టీ అధికారంలోకి రాగానే ఈ నకిలీ మందుల వ్యవహారం, మెడికల్ మాఫియా, ప్రైవేట్ అంబులెన్స్ ల ఆగడాల అంతు చూస్తామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో నాగరాజు రాయల్, కోకిల, ఆల్వార్ మురళి, కష్ణ, భారతి, లతా పాల్గొన్నారు.

గులకరాయి డ్రామాకు తెరదించండి: చినబాబు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

సీఎం జగన్ పై జరిగిన గులకరాయి డ్రామాకు ఇకనైనా తెరదించాలని టిడిపి తిరుపతి పట్టణ అధ్యక్షులు వట్టికుంట శంకరనారాయణ(చినబాబు) విజ్ఞప్తి చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్న గులకరాయితో ప్రాణం పోయే పరిస్థితి ఉండదని, విద్యుత్తును ఆపుచేసి దాడి చేయించుకుని ప్రతిపక్షాలపై నెట్టడానికే ఈ డ్రామా ఆడారని ఆరోపించారు. దీనిపై తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి ధర్నా చేయడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. ఆయన వైసిపి హత్య రాజకీయాలకు దూరంగా ఉంటుందని అన్నారని, ఆయన నివాసానికి వైయస్ రాజారెడ్డి గారి నిలయం అని పేరు పెట్టుకుని ఆయన కుమారుడిని విచక్షణారహితంగా నరికి చంపి ఐదేళ్లు కావస్తున్న ఏనాడూ నిరసన కార్యక్రమాలు చేయలేదు ఎందుకు అని ప్రశ్నించారు. సత్తు మధుసూదన్ యాదవ్, రామచంద్ర రెడ్డి, రామ్మూర్తి రాయల్ పాల్గొన్నారు.

సీఎంపై దాడి విషయంలో మానవత్వం చూపరేం: అజయ్ కుమార్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డిపై దుండగుడు రాయితో దాడి చేస్తే ఆ సంఘటనపై ప్రతిపక్షాలు మానవత్వంతో స్పందించాల్సింది పోయి డ్రామాలంటూ దెప్పిపొడుపు వ్యాఖ్యలు చేయడం దారుణమని తిరుపతి జిల్లా వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు ఆరే అజయ్ కుమార్ అన్నారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఆయన విలేకరులతో మాట్లాడారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో 35 వేల మంది మహిళలు అదశ్యమయ్యారని చెప్పారని, అదశ్యమయ్యారని పవన్ కు ఎవరైనా ఫిర్యాదు చేశారా అనే ప్రశ్నించారు. టిడిపి నాయకుడు పట్టాభి సీఎం రక్తం తుడుచుకోకూడదంటూ మాట్లాడడం వారి అవగాహన రాహిత్యానికి నిదర్శనమన్నారు.

లాస్యను సన్మానించిన రంగస్థలి చైర్మన్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వడమాల పేట మండలం, కాయంపేటకు చెందిన లాస్యను రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహిస్తే మరింత ఉత్సాహంతో ఉన్నత లక్ష్యాలను చేరుకుంటారని గోపీనాథ్ తెలిపారు. లాస్య 1000 మార్కులకు గాను 986 మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. ఈ సత్కార కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి కార్యదర్శి రాజా, సభ్యులు తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, లాస్య కుటుంబ సభ్యులు మనోహర్ రెడ్డి, ప్రభావతమ్మ, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

స్వచ్ఛందమా... ఒత్తిళ్లా..!

ఎంపిడిఒకు పత్రాలను అందజేశారు. అనంతరం జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఎంపిపి శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వలంటీర్ల సమావేశం జరిగింది. జగన్మోహన్‌రెడ్డిని సిఎం చేయడానికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. డిసిసిబి ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ 216 మంది ఒకేరోజు రాజీనామా చేయడాన్ని అభినందించారు. సూళ్లూరుపేట ఎంఎల్‌ఎ కిలివేటి సంజీవయ్యను రెట్టింపు ఉత్సాహంతో గెలిపించాలని కోరారు.

– గూడూరు పట్టణంలోని సగన్‌నగర్‌లోని వైసిపి కార్యాలయంలో స్వచ్ఛందంగా రాజీనామా చేసిన 40 మంది వాలంటీర్లను వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి మేరిగ మురళీధర్ అభినందించారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ కొట్టు ఉదయ్‌కుమార్ పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చేవూరు విజయ్‌మోహన్‌రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు పాల్గొన్నారు. వలంటీర్లతో రాజీనామాలు చేయించడం మంచిది కాదని, టిడిపి కూటమి అధికారంలోకి వస్తే వలంటీర్లకు పదివేల వేతనం ఇస్తామని ఆ పార్టీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ తెలిపారు.


జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

పోలీసుల తనిఖీలో 31.50 లక్షల నగదు స్వాధీనం

ప్రజాశక్తి –తిరుపతి సిటీ

పోలీసుల తనికెల్లో 31 లక్ష 50వేలు రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్న ఘటన సోమవారం తిరుపతిలో చోటుచేసుకుంది. ఈస్ట్ డిఎస్పి సురేందర్ రెడ్డి కథనం మేరకు పోలీసులు సాధారణ తనిఖీల్లో భాగంగా చాపల మార్కెట్ వద్ద పోలీసుల తనిఖీలలో భారీ స్థాయిలో నగదు పట్టుబడింది. కరకంబాడి కి చెందిన రెడ్డి భాష, తిరుపతి శేషాద్రి కాలనీకి చెందిన ఉదయభాను మూర్తి ఓ కారులో నగదు తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉండడంతో నగదును సీజ్ చేసి ఇన్కమ్ టాక్స్ అధికారులకు అప్పగించారు.

శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో..

రాజ్యాంగబద్ధంగా నడుచుకోవడమే అసలైన నివాళి

ప్రజాశక్తి–శ్రీకాళహస్తి

స్వేచ్ఛ, సమానత్వం, రాజ్యాంగబద్ధంగా నడుచుకోవడమే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కు మనమిచ్చే ఘనమైన నివాళి అని పలువురు సీనియర్ పాత్రికేయులు అభిప్రాయపడ్డారు. అంబేద్కర్ జయంతిని ఆదివారం శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పాత్రికేయులు ఘన నివాళి అర్పించారు. అట్టడుగువర్గాలు ప్రస్తుతం అనుభవిస్తున్న స్వేచ్ఛా, స్వాతంత్రాలు బీఆర్ అంబేద్కర్ చలవేననీ, రాజ్యాంగ విలువలు కాపాడాల్సిన బాధ్యతను పాత్రికేయులు తమ భుజాన వేసుకోవాలని నినదించారు. అనంతరం 200 మంది పేదలకు అన్నదానం చేశారు. సీనియర్ పాత్రికేయులు ఎంవీ రమణ, వలిపి శ్రీరాములు, వాటంబేటి రవి, బాలసుబ్రమణ్యం, వీసీ వెంకటయ్య, మల్లెంబాకం మునికృష్ణా రెడ్డి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కామేష్, పీఆర్వో యాసిన్, హరిబాబు, మైదీన్, సూర్యకుమార్, కోటా చంద్రశేఖర్, పేటా శేఖర్, జీ.చంద్ర, చక్రపాణి, బాలు, చాన్ బేగం, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బిందెమీద బిందె పెట్టి.. కిలోమీటర్ల దూరం నుంచి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ

వేసవి మండిపోతోంది.. నాలుక తడారిపోతోంది.. మండుటెండలో చల్లని నీరు తాగితే శరీరం చల్లబడుతుంది. అయితే బిఎన్ కండ్రిగ మండలంలో చివరి గ్రామంగా ఉన్న తిమ్మి గోపాలపురం తాగునీరు లేక అల్లాడే పరిస్థితి. ఈ గ్రామాన్నే టిజీపురం అనీ అంటారు. అధికారుల దృష్టికి అనేకమార్లు తీసుకెళ్లినా పట్టించుకోలేదన్న ఆవేదన వారిలో ఉంది. దీంతో తాగునీటి కోసం పేదలు గ్రామంలోని కిలోమీటర్ దూరంలోని క్వారి గుంతల నుంచి నీరు తెచ్చుకుంటున్నారు. గొంతెండుతోంది ఆదుకోండి అంటూ అధికారులను వేడుకొంటున్నారు. మండల అధికారులు స్పందించిన పాపాన పోలేదని వారు వాపోతున్నారు. ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో, కిలోమీటర్ల దూరం నంచి నీటి మోత తప్పడం లేదని కన్నీరుమున్నీరవుతున్నారు.

దూరాభారం నుంచి నీళ్లు తెస్తూ..

'రామాయణంలో అనేక వైజ్ఞానిక అంశాలను తెలుసుకోవాలి'

ప్రజాశక్తి – క్యాంపస్

జాతీయ సంస్కృత విద్యాలయం తిరుపతిలోని చెలికాని అన్నారావు సభాభవనంలో "శ్రీమద్రామాయణంలో భారతీయ జ్ఞానపరంపర" అనే అంశంపై అంతర్జాతీయ సదస్సును జ్యోతిప్రజ్వాలనం చేసి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిగా నేపాల్ లోని, ఖాట్మాండులోని నేపాల్ సంస్కృత విశ్వవిద్యాలయం, వాల్మీకి విద్యాపీఠం ప్రాధ్యాపకులు పద్మప్రసాద భట్టరాయి విచ్చేసి శ్రీమద్రామయణ వైశిష్ట్యాన్ని వివరించారు. ఆయన మాట్లాడుతూ శ్రీమద్రామయణం భారతీయ జ్ఞాన పరంపరకు నిధి అని వివరించారు. రామాయణంలో అనేక వైజ్ఞానిక అంశాలను వర్ణించడం జరిగిందని తెలిపారు. రామాయణం సర్వమానవాళికి మార్గదర్శకమని, అందులోని అంశాలను అనుసరించి జీవించినట్లయితే ఆనందమయమని, ఆ ఆనందమే రామమయమని వర్ణించారు. అందరూ రామమార్గాన్ని అనుసరించి ముందుకు వెళ్లాలని సూచించారు. సారస్వత అతిథిగా రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం పూర్వ ఉపకులపతి ప్రొ.హరేకృష్ణ శతపథి విచ్చేసి శ్రీమద్రామాయణ

గొప్పతనాన్ని తెలిపారు. ఆయన మాట్లాడుతూ చతుర్దశ విద్యా స్థానాలు ఏవైతే ఉన్నాయో అవి భారతీయ పరంపరకు అత్యంత ముఖ్యమని, ఆ విషయాలన్నీ శ్రీమద్రామాయణంలో మనం విశ్లేషించవచ్చని అన్నారు. శ్రీమద్రామాయణం సర్వ జగద్రక్షకమని రామాయణంలో భారతీయ జ్ఞాన పరంపరకు సంబంధించిన అనేక విషయాలు నిక్షిప్తమై ఉన్నాయని, అందువల్ల భారతీయ పరంపరకు ఒక దర్పణం వంటిది శ్రీమద్రామాయణమని వివరించారు. సభాధ్యక్షులు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ.జిఎస్సార్ కృష్ణమూర్తి మాట్లాడుతూ శ్రీమద్రామాయణంలో భారతీయ జ్ఞాన పరంపర అనేటువంటి అంతర్జాతీయ సదస్సును సాహిత్య విభాగం ద్వారా ఇక్కడ నిర్వహించడం అత్యంత ఆనందదాయకమని వివరించారు. శ్రీమద్రామాయణం భారతీయ జ్ఞాన పరంపరకు మూల ఆధారమని, ఆదికావ్యం రామాయణం ద్వారా అన్ని అంశాలను వివరించడం జరిగిందని తెలియజేశారు. అందువల్ల ప్రతి ఒక్కరూ రామ మార్గాన్ని అనుసరించి ముందుకు సాగాలని సూచించారు. ఆత్మీయ అతిథులు అకడమిక్ డీన్ ప్రొ.టి.వి రాఘవాచార్యులు మాట్లాడుతూ శ్రీరాముని లీల ప్రపంచమే భారత సృష్టి అని వివరించారు. జ్ఞాన సంబంధ విషయాలన్నీ రామాయణంలో నిక్షిప్తమై ఉన్నాయని వివరించారు. గౌరవాధితులు సాహిత్య సంస్కృతి సంకాయ అధ్యక్షురాలు ప్రొ.సి.లలితా రాణి మాట్లాడుతూ శ్రీమద్రామాయణం సర్వజ్ఞాన సమ్మిళితమని, రామాయణంలో అన్ని విషయాలను చాలా స్పష్టంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ గా సాహిత్య విభాగం అధ్యక్షులు ప్రొ.కె.రాజగోపాలన్, కోఆర్డినేటర్ ప్రొ.సి.రంగనాథన్, విశ్వవిద్యాలయం విభిన్న విభాగాల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి : డిఆర్ఓ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: సార్వత్రిక ఎన్నికలు -2024 నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు సైతం తమ ఓటుహక్కును అవరోధ రహితంగా, స్వేచ్ఛగా వినియోగించుకోవడానికి జిల్లా యంత్రాంగం తరపున అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని డిఆర్ఓ పెంచల్ కిషోర్ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని డిఆర్ఓ ఛాంబర్ నందు డి ఆర్ ఓ పెంచల కిషోర్ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులు హోమ్ ఓటింగ్ కు అవరోధ రహిత ఓటింగ్ ఏర్పాట్ల పై జిల్లా మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లా లోని విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులు సైతం సార్వత్రిక ఎన్నికలు-2024 సందర్భంగా తమ ఓటు హక్కును అవరోధ రహితంగా, స్వేచ్ఛగా వినియోగించుకోవడానికి ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో ర్యాంప్‌లు, రైలింగ్, వీల్ ఛైర్లు, అంధులకు బ్రెయిలీ బ్యాలెట్ పేపర్లు మొదలగు సదుపాయాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పోలింగ్ స్టేషన్ కు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవడానికి తగిన రవాణా సదుపాయానికి సంబంధించి పూర్తి ఏర్పాట్లను చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విభిన్న ప్రతిభా వంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి ఏవై శ్రీనివాస్, మెప్మా పీడీ రాధమ్మ, డి ఎం అండ్ హెచ్ ఓ శ్రీహరి, డి సి హెచ్ ఎస్ ఆనందమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడు అనుమానాస్పద మృతి

అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వృద్ధుడు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు ఎ్‌ ట్ట ణ ం ల ో ఐసిఎస్‌రోడ్డుపై ఓ వృద్ధుడు మృతి చెంది వుండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. డి.ఎస్.పి సూర్య నారాయణ రెడ్డి సంఘ టన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీ లించారు. పోలీసుల కథ నం మేరకు.. మృతుడిది మనుబోలు మండలం కొండూరు గ్రామానికి చెందిన మస్తానయ్య (65)గా గుర్తించారు. మృతుడు మస్తానయ్య రక్తపు మడుగులో పడి ఉండడంతో ఈ ప్రమాదం ఎలా జరిగింది? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గూడూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టరు ఢీ యువకుడు మృతి

ప్రజాశక్తి -పుంగనూరు: ట్రాక్టరు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. నిమ్మనపల్లి మండలం బండ్లపై గ్రామానికి చెందిన గంగులప్ప కుమారుడు సతీష్ (26) మదనపల్లి లో పెయింటింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. యధావిధిగా ఆదివారం పెయింటింగ్ పనికి వెళ్లాడు. పని ముగించుకొని ఆలస్యంగా స్వగ్రామానికి బయలు దేరాడు. పుంగనూరు మండలంలోని చంద్రమాకులపల్లి పంచాయతీ కృష్ణాపురం వద్ద ద్విచక్ర వాహనంలో వెళుతుండగా ట్రాక్టర్ ఢీకొంది. యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. అదే కుటుంబంలో ఏడు నెలల క్రితం అతని అన్న కూడా మృతి చెందాడు. వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులు విషాదంలో మునిగి పోయారు. పుంగనూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నా రు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

22 లోపు ఓటరు క్లెయిములు పరిష్కరించాలి

25వ తేదీ నాటికి ఇంటిగ్రేటెడ్ ఓటర్ జాబితాను సిద్ధం చేయాలి - కలెక్టర్ , జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ఓటర్ల జాబితాకు సంబంధించి ఈ నెల 14 వ తేదీ వరకు వచ్చిన ఫారం -6 క్లెయిములు , ఫారం 8లో చిరునామాల మార్పులకు సంబంధించి వచ్చిన క్లెయిములను సంబంధిత ఈఆర్ఓ, ఎఈఆర్ఓలు ఈ నెల 22 వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్ , జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నుండి జిల్లాలోని ఈఆర్ఓ, ఎఈఆర్ఓ లతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాకు సంబంధించి ఈ నెల 14 వ తేదీ వరకు వచ్చిన ఫారం -6, ఫారం 8 లో చిరునామాల మార్పు కోసం వచ్చిన క్లెయిములను 22 వ తేదీ లోపు పరిష్కరించాలన్నారు. తదనుగుణంగా ఎన్నికల నామినేషన్ల ఆఖరు తేదీ 25 నాటికి ఇంటిగ్రేటెడ్ ఓటర్ల జాబితా సిద్ధం కావాల్సి ఉంటుందని కలెక్టర్ ఆదేశించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో ఈఆర్ఓ, ఎఈఆర్ఓలు, ఎలెక్టోరల్ రోల్స్ నోడల్ అధికారి దేవేంద్ర రెడ్డి హాజరయ్యారు.

మేరిగ మురళిని ఆదరించండి

- వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపురెడ్డి వినోద్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి -కోట : గూడూరు నియోజకవర్గం నుండి వైసీపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న మేరిగ మురళిని ఆదరించాలని వైసీపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి కోరారు. ఈ ఎన్నికల్లో మేరిగ మురళిని గెలిపించాలని కోరుతూ సోమవారం కోట మండలంలో పట్టణ పరిధిలో సోమవారం ఆందరికీ కరపత్రాలు అందించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లపురెడ్డి వినోద్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పై ప్రతిపక్షాలు అన్యాయంగా దాడులు నిర్వహించడం అన్యాయమన్నారు. ఇలాంటి సంఘటనలన్నీ ప్రజలు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని, ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలకు ప్రజలందరూ తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో కోట బిట్టు టు ఎంపిటీసీ అభ్యర్థి షేక్ మొబిన్ బాష పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న నల్లపురెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి

17 నుంచి శ్రీ కోదండ రామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి- రామచంద్రాపురం(చంద్రగిరి) : చంద్రగిరిలో శ్రీ కోదండ రామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 16వ తేదీ అంకురార్పణతో ప్రారంభం కానున్నాయని ఆలయ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రగిరిలో వెలసిన శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 17 నుండి 25వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 17వ తేదీ ఉదయం 9.5 నుండి 10 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజారోహణం నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 నుండి రాత్రి 7.30 గంటల వరకు శ్రీ కోదండ రామస్వామివారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఏప్రిల్ 23వ తేదీ ఉదయం 10 నుండి 11.30 గంటల వరకు సీతారాముల కల్యాణోత్సవం నిర్వహి స్తారు.రూ.750 చెల్లించి గృహస్తులు(ఇద్దరు) కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. సాయంత్రం 6.30 నుండి రాత్రి 7.30 గంటల వరకు గరుడ వాహనంపై స్వామి ఊరేగుతూ భక్తులను దర్శనం కల్పించనున్నారు. 25వ తేదీ ఉదయం 9 నుండి 10.30 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సర్లకు, చక్రత్తాళ్వార్‌కు స్నపన తిరుమంజనం, ఉదయం 10.30 నుండి 11 గంటల వరకు చక్రస్నానం వైభవంగా నిర్వహించనున్నారు. సాయంత్రం 6.30 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ఏప్రిల్ 26వ తేదీ ఉదయం 9 నుండి 10.15 గంటల వరకు శ్రీ రామపట్టాభిషేకం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, దాససాహిత్య ప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో హరికథలు, భజనలు, సంగీత కచేరీలు నిర్వహించనున్నట్లు టిటిడి అధికారులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మామిడి తోట దగ్ధం

రూ. నాలుగు లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కనమనంబేడు పంచాయతీలోని మామిడి తోటకు సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించారు. మామిడి తోట చుట్టు పక్కల కంచి మొత్తం పూర్తిగా దగ్ధమైంది ఆ కంచి పక్కనే ఉన్న చెట్లు మొత్తం పూర్తిగా కాలిపోయి ఆ చెట్టుకు ఉన్న కాయలు పూర్తిగా కాలిపోయాయి. ఆ మామిడి తోటలో వేసిన పైప్ లైన్, మోటార్ స్టార్టర్ కూడా కాలిపోయింది. ఈ మొత్తానికి కలిపి గ్రామస్తులు నాలుగు లక్షల రూపాయలు వరకు నష్టం వాటిల్లి వుంటుందని అంచనా వేశారు. ఈ మామిడి తోట సత్యవేడుకు చెందిన కిరణ్ కుమార్‌ది అయితే ఆ తోటను తమిళనాడుకు చెందిన తాజుద్దీన్ ఆరంభాగం మామిడి కాయలను లీజుకు తీసుకున్నాడు. ఆ తోటలో వచ్చే కాపు మాత్రం ఇతను లీజు తోటను యజమానికి అప్పగించి నష్టం, లాభం వచ్చి తానే భరిస్తానని ఒప్పందం చేసుకున్నాడు. ఆ మామిడి తోట కాపు తీసుకున్న అతను చాలా పేదవాడు కావడంతో ఆ తోట దగ్ధమైనందుకు అతను తోటలోనే కుప్పకూలిపోయాడు. అప్పుచేసి ఈ మామిడి తోట తీసుకున్నానని, ఇలా జరగడంతో అప్పు తీరకపోతే తానేం చేయాలో తెలియక ఆవేదనతో కుటుంబం మొత్తం ఆయోమయంలో పడ్డారు. సంబంధిత అధికారు లు మామిడి తోటను పరిశీలించి పేదవాడైన ఆ లీజు దారునికి ప్రభుత్వం సాయం చేసి ఆదుకోవాలని కనమనంబేడు గ్రామ సర్పంచి, గ్రామస్తులు కోరుతున్నారు.

కాలి బూడిదైన మామిడి చెట్టు

మహారాజ రాజశ్రీ సత్యవేడు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

C.Sasidhar ...Plaintiff

V/s

D.Dildhar ..Defendant

NOTICE TO DEFENDANT

Dudekula Dildhar, S/o D.Moula Saheb R/o D.No.3-55/19, B.G.R. Nagar, Pichaturu Town & Post, Mandal, Tirupati District,

పై దావాలోని ప్రతివాదికి సమన్లు నిమిత్తం వాయిదా 25.04.2024 వున్నది. ఆరోజు ప్రతివాది స్వయముగా గాని, వకీలు ద్వారా కాని ఉ॥ 10.30 గం॥లకు కోర్టు నందు హాజరు అయి ఏదైనా ఆక్షేపనలు వున్నయెడల తెలుపుకోవలయు ను. లేని యెడల పరోక్షముగా తీర్మానించబడును యని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఎన్.శ్రీనివాసరావు
ఎం.హేమసుందర్
న్యాయవాదులు, తిరుపతి

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE CUM JUDICIAL 1ST CLASS MAGISTRATE::PUTTUR
IA No. 234/2024, IA No. 235/2024
IA No. 236/2024, O.S. No.56/2015.
BETWEEN:
D.Sankaramma and others
...Petitioners/Plaintiffs
AND:
K. Bala Subramanyam and others
...Respondents/Defendants

NOTICES TO RESPONDENTS NO. 11 to 13

11. K.Naga Jyothi, W/o K.Muninagulu, aged 58 years
12. K. Aravind Krishna, S/o K. Muninagulu, aged 40 years,
13. K. Anil Kishore, S/o K. Muninagulu, aged 37 years, No. 11 to 13 are residing at 102, Sreepadha Ramachandra Nilayam, Tirupati town and district.

...Proposed parties
/Defendants No. 11 to 13

Please take notices that, the above case was filed by the petitioner/plaintiff as against you and some others for declaration and consequential relief of permanent injunction in the above court and the same is posted on: 24.04.2024. Hence you are here by directed to attend before the above court at about 10-30 A.M. either by person or through Advocate. Otherwise the above case will be decided an exparty.

Hg. date: 24.04.2024

G. Raja Reddy, B.Com, L.L.B.
P. Kumarvel, B.com, L.L.B.,
Advocates Puttur.

మహారాజ శ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు లో
E.P.NO: 50 OF 2022
O.S.NO: 156 OF 2018

Madiri Mounika ...DHR

Vs

1. Doniparthi Bhagyalakshmi,
2. Padala Teja,
3. Padala Vidhula

Nos.2 and 3 being minors Rep. by their mother and Guardian Doniparthi Bhagyalakshmi (1st JDR) ...JDRs

వేలం ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పై నెంబరు లోని DHR తన డిక్రీ బాకీ రాబట్టుకొనుటకు గాను JDRs తాలూకు ఈ క్రింద కనపర్చిన స్థిరాస్తిని పై కోర్టులో తేది: 19-06-2024న ఉదయం 10.30 గం॥లకు వేలం వేయబడును.

SCHEDULE

SPSR Nellore District, present Tirupati District, Gudur Registration District, Gudur Sub-Registration, Gudur Mandal, Chennuru Village, Chennuru Gramapanchayat Bit-II, Near Door No.27, Assessment Nos.279 and 367, S.Nos. 1688/1A, 1892/A and 1892/B, Block No.4. Mittaveedi, 153.84 Sq. Meters of site and 102.70 Sq. Meters of Ground floor and 102.70 Sq. Meters of First floor, open site 51.14 Sq. Meters therein situated within the following boundanes:-

East:- House of K. Prasad; South: Houses of Raghavaiah and Chalamaiah and Venkateswarlu; West :- Road; North: House of Sankaraiah.

DHR విలువ రూ॥ 1,50,000-00
అమీన విలువ రూ॥ 15,00,000-00

ఇట్లు
టి. రఘురామిరెడ్డి
DHR తరపున న్యాయవాది, గూడూరు

బ్యాంకును ముట్టడించిన చేనేత కార్మికులు

ప్రజాశక్తి-వరదయ్యపాలెం

ముద్ర లోన్‌ను మంజూరు చేయాలని చేనేత కార్మికులు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్‌ను సోమవారం ముట్టడించారు. ఈ సందర్భంగా చేనేత కార్మిక యూనియన్ నాయకులు రవి మాట్లాడుతూ చేనేత కార్మికులకు ఆర్థికంగా సహకారం అందించాలన్న దఢ సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ముద్ర లోన్ కోసంఏడాదిగా కాళ్లరిగేలా తిరుగుతున్నామన్నారు. పట్టించుకోకపోవడంతో నేతన్నలు ధర్నా నిర్వహించారు. అయితే మేనేజర్ అనుచితంగా వీరిపట్ల వ్యవహరిస్తూ కూర్చున్న వారిని కాళ్లతో నెడుతూ, ఇక్కడినుంచి లేవాలంటూ దురుసుగా వ్యవహరించారు. చేనేతలు ఆగ్రహించడంతో ఫీల్డ్ ఆఫీసర్ కలగజేసుకుని సమస్య తెలుసుకుని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో చేనేతలు ధర్నా విరమించారు.

కరెంట్ మీటర్ రీడర్లకు పీస్‌రేట్ పెంచాలి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న మీటర్ రీడర్లకు మూడు కంపెనీల పరిధిలో పీస్‌రేట్ పెంచాలని, పని దినాల ఒత్తిడి తగ్గించాలని, ఎస్కో కంపెనీ ద్వారా అకౌంట్లు ఓపెన్ చేసి వేతనాలు చెల్లించాలని విద్యుత్ మీటర్ రీడర్స్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డిస్కం అధికారులను కలిసి వినతిపత్రాలను అందజేశారు. జిల్లాస్థాయి అధికారులు, కాంట్రాక్టర్లు ఏప్రిల్‌నుంచి ఆరో తేదీ కల్లా బిల్లింగ్ కంప్లీట్ చేయాలని ఆదేశిస్తున్నారని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారని తెలిపారు. పనిదినాల ఒత్తిడి తగ్గించి, వేతనాలను చెల్లించాలని నాయకులు రామకృష్ణ, రమేష్, శివారెడ్డి, కిరణ్‌కుమార్, షేక్ హాజరత్ వలి, పవన్ పాల్గొన్నారు.

వచ్చారండి...ప్రచారానికి..!

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఎట్టకేలకు తిరుపతిలో అసమ్మతి సెగ చల్లారినట్లు కనిపిస్తోంది. కూటమిలో లోకల్‌గా ఎవరికిచ్చినా పనిచేస్తామని, నాన్ లోకల్‌కు సీటు ఇవ్వడం ఏంటంటూ టిడిపి, జనసేన పార్టీల్లో చిచ్చు తారాస్థాయికి చేరుకుంది. దీంతో ఆయా అధినేతలు నారా లోకేష్, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నాగబాబులు జోక్యం చేసుకుని బుజ్జగించారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ కూటమి ఓటు చీలరాదని వార్నింగ్ ఇచ్చారు. దీంతో టిడిపి మాజీ ఎంఎల్‌ఎ సుగుణమ్మ, జనసేన తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్, టిడిపి నేతలు వూకా విజయ్‌కుమార్, నరసింహయాదవ్, జెబి శ్రీనివాస్‌లు మనస్సులో బాధ ఉన్నా, అధినేతల ఆదేశాల మేరకు సోమవారం జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాస్ ప్రచారంలో ముందుండటం గమనార్హం.

చిత్తూరు వైసిపి సిట్టింగ్ ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాస్‌కు అక్కడ సిట్టింగ్ దక్కకపోవడంతో ఆర్థిక, సామాజికబలంతో చంద్రబాబును, పవన్‌కల్యాణ్‌ను ఒప్పించి సీటు దక్కించుకున్నారు. అయితే తమకే టిక్కెట్ ఖాయమని మాజీ ఎంఎల్‌ఎ సుగుణమ్మ, టిడిపి నేతలు వూకా విజయ్‌కుమార్, జెబి శ్రీనివాస్ నమ్మకంగా ఉన్న సమయంలో ఈ నిర్ణయం వారిని నిరాశకు గురిచేసింది. తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ సైతం తొలినుంచి దూరంగానే ఉన్నారు. పొత్తులో భాగమైతే తనకే సీటు ఇస్తారన్న ధీమాతో ఉన్నారు. ఉన్నట్టుండి ఆరణి శ్రీనివాస్‌ను ప్రకటించడంతో అటు టిడిపిలోనూ, ఇటు జనసేనలోనూ టిక్కెట్ ఆశించిన వారిలో నిరాశ ఆవహించింది. ఓ రేంజిలో అభ్యర్థి ఆరణి శ్రీనివాసుపై

జనసేన అభ్యర్థి ప్రచారంలో సుగుణమ్మ

విరుచుకుపడ్డారు. పవన్‌కల్యాణ్ ఆదేశిస్తే కుక్కనైనా గెలిపిస్తామని, అయితే నాన్‌లోకల్ ఆరణి శ్రీనివాసులు వద్దని కిరణ్‌రాయల్ మండిపడ్డారు. దాదాపు 15 రోజులపైనే వీరి వ్యతిరేకతను ప్రదర్శిస్తూ, ప్రచారానికి దూరంగా ఉంటూ వచ్చారు. వీరి గ్రూపు తగాదాల వల్ల వైసిపి అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి గెలుపు సునాయాసమని చర్చ నడిచింది. అయితే జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆకస్మికంగా తిరుపతికి శుక్రవారం సాయంత్రం వచ్చి, రాత్రంతా వేర్వేరుగా టిడిపి, జనసేన పార్టీ నేతలతో చర్చలు జరిపారు. మాట వినకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలా ఒప్పించారో గాని, మూడు పార్టీల నాయకులు సర్దుకున్నారు. శనివారం నుంచి తాము ప్రచారంలో ఉంటామని పవన్‌కల్యాణ్‌కు మాట ఇచ్చారు. శని, ఆదివారాల్లోనూ అసమ్మతి నేతలు ప్రచారంలో పాల్గొనలేదు. ఈ విషయాన్ని అధినేతలు ఎక్కడ సీరియస్‌గా తీసుకుని చర్యలు తీసుకుంటారోనని భయపడి సోమవారం ప్రచారంలో కనిపించారు.

ప్రభుత్వాన్ని విమర్శించడమే పనా : భూమన కరుణాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ప్రభుత్వాన్ని విమర్శించడమే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పనిగా పెట్టుకున్నారని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి విమర్శించారు. సోమవారం తిరుపతి కొర్లగుంటలో ప్రచారం నిర్వహించారు. తిరుపతిలో టిడిపి, జనసేన, బిజెపి నాయకుల వింత ప్రవర్తనతో నవ్వొస్తుందన్నారు. గెలిస్తే ఏమి చేస్తారో చెప్పకుండా, ఎంతసేపు తనను, తన కుమారుని తిట్టడానికే వాళ్ల సమయం వృథా అవుతోందన్నారు. తాము వేసిన రోడ్లలో భూములను తిరిగి అప్పగిస్తామని, రోడ్లను తీసేస్తామని మాట్లాడుతున్నారన్నారు. తాను వేలాదిమంది టిటిడి ఉద్యోగులకు స్థలాలు ఇప్పించానని, పెంచిన జీతాల కారణంగా లక్ష ఓట్లు ప్రభావితం అవుతాయని వారు భయపడుతున్నారన్నారు. అందుకే తనను టిటిడి ఛైర్మన్‌గా తీసేయాలని కొత్త పల్లవి అందుకున్నారన్నారు. స్థలాలు ఇప్పించడం, జీతాలు పెంచడం తప్పా అని ప్రశ్నించారు. తిరుపతిలో జరిగిన అభివృద్ధి వారికి కంటగింపుగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, అభ్యర్థి అభినయ రెడ్డి పాల్గొన్నారు.

వైసిపి అభ్యర్థి నూకతోటి రాజేష్‌కు చేదు అనుభవం

గ్రామానికి రానీకుండా అడ్డుకున్న దళితులు

ప్రజాశక్తి - కెవిబిపురం

సత్యవేడు వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి నూకతోటి రాజేష్‌కు చేదు అనుభవం ఎదురయ్యింది. కెవిబిపురం మండలంలో ఎన్నికల ప్రచారానికి విచ్చేసిన నూకతోటి రాజేష్ ఎస్‌ఎల్‌పురం వేమలపూడిలో ప్రచారం పూర్తి చేసుకుని కళత్తూరుకు బయల్దేరారు. కళత్తూరు దళితులు రాజేష్ కారును అడ్డుకున్నారు. వైసిపి హయాంలో ఏమి మేలు చేశారని ఓట్లు అడగడానికి వచ్చారని నిలదీశారు. గ్రామంలోకి వెళ్లనీకుండా అడ్డుకున్నారు. ఎంపిపి భర్త నందకుమార్, వైసిపి మండలాధ్యక్షులు కృష్ణయ్యతో కలిసి వస్తే రానీయమని, ఆ ఇద్దరు నేతలు ఎంతో ఇబ్బంది పెట్టారని, వారికి తమ గ్రామానికి వచ్చే అర్హత లేదన్నారు. అభ్యర్థి రాజేష్ వారికి నచ్చజెప్పినా ఫలితం లేకపోయింది. దీంతో ప్రచారం చేయకుండానే వెనుదిరిగారు. కళత్తూరు దళితులు మాట్లాడుతూ తమ మండలంలో అతిపెద్ద పంచాయతీ అయిన పెరిందేశం కళత్తూరు గ్రామాల్లో ఓట్ల శాతం ఎక్కువని, ఆ ఇరువురూ కలిసి రాజకీయాలు చేస్తూ తమపై దాడులు చేయిస్తూ పెద్దిరెడ్డి పేరు చెప్పుకుని దళితులపై కేసులు కట్టిస్తున్నారన్నారు. సత్యవేడు నియోజకవర్గం 2019 ఎన్నికలకు ముందు టిడిపి కంచుకోట. 2019 ఎన్నికల తరువాత ఆదిమూలం గెలుపుతో టిడిపి కంచుకోట బద్దలై వైసిపి జెండా రెపరెపలాడిందన్నారు. సత్యవేడు నియోజకవర్గంలో ఏడు మండలాల కన్నా కెవిబిపురం మండలం చాలా పెద్దదని, ఎస్సీ సామాజికవర్గం ఎక్కువన్నారు. అయితే 'స్థానిక' నాయకుల వల్ల తమ పంచాయతీల్లో ఎటువంటి సమస్యలు పరిష్కారం కాలేదని వారు వాపోయారు.

బిఎన్ కండ్రిగ మండలంలో తలారబెట్టి పంచాయతీ ఎన్టీఆర్ నగర్ ఎస్టీ కాలనీ, వెస్ట్ వరత్తూరు, కంచన పుత్తూరు గ్రామాల్లో నూకతోటి రాజేష్ సోమవారం పర్యటించారు. కళ్లివెట్టు గ్రామంలో చేనేత కార్మికుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, విద్యానాథరెడ్డి, ప్రసాద్‌పాల్ గురవయ్య, మునస్వామి పాల్గొన్నారు.

బొజ్జల పాలన తిరిగి తేవడమే అసలైన నివాళి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో బొజ్జల పాలనను తిరిగి తేవడమే నాన్నకు ఇచ్చే అసలైన నివాళి అని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం మాజీ మంత్రి బొజ్జల గోపాలకష్ణా రెడ్డి జయంతిని నిర్వహించారు. ముందుగా బొజ్జల కుటుంబ సభ్యులు ఊరందూరు వద్ద ఉన్న బొజ్జల సమాధి వద్ద నివాళులార్పించారు. అనంతరం స్థానిక టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద విజయ్ కుమార్ నాయుడు ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు.

3 నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ ప్రక్రియ వచ్చే నెల 3వ తేదీన ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఎన్నికల విధుల్లో భాగస్వాములయ్యే ఉద్యోగులు, కేంద్ర సర్వీసుల్లో పని చేసే సిబ్బంది, దివ్యాంగులు, 85 సంవత్సరాలు దాటిన వయోవద్ధులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం వెసులుబాటు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ అవకాశాన్ని ఎంచుకున్న దివ్యాంగులు, వయోవద్ధులు మాత్రమే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు.

ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు రెండో దఫా శిక్షణ సందర్భంగా ఏర్పాటు చేసే ఫెసిలిటీ కేంద్రంలో ఓటు వేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేయనున్నారు. మే 3న ఈ ప్రక్రియ ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. ఎనిమిదో తేదీలోగా పూర్తి చేయాల్సి ఉంది. సాధారణ పోలింగ్ తేదీ కన్నా నాలుగు రోజుల ముందుగానే ఇది పూర్తి చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ నెల 30 నుంచి పోస్టల్ బ్యాలెట్ ముద్రణ మొదలుపెట్టి వచ్చే నెల రెండో తేదీలోగా పూర్తి చేయనున్నారు. ఈవీఎం యంత్రాలపైన ఉంచే బ్యాలెట్ పత్రాలను హైదరాబాద్‌లోనే ముద్రించాలని అధికారులు నిర్ణయించారు. పోస్టల్ బ్యాలెట్ పత్రాలను ఆయా జిల్లాల్లోనే ముద్రించాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

13 లక్షల పత్రాల ముద్రణ

లోక్‌సభ ఎన్నికలకు సుమారు 13 లక్షల పోస్టల్ బ్యాలెట్ పత్రాలను ముద్రించాలని అధికారులు నిర్ణయించారు. 85 సంవత్సరాలు దాటిన వారు రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 4.50 లక్షల మంది ఉన్నట్లు అంచనా. దివ్యాంగ ఓటర్లు సుమారు 5 లక్షల మంది నమోదయ్యారు. ఎన్నికల విధుల్లో సుమారు 2.60 లక్షల మంది ఉద్యోగులు భాగస్వాములు



85 ఏళ్లు పైబడిన వృద్ధులకూ..

కానున్నారు. రాష్ట్రానికి చెందిన 15 వేల మందికిపైగా సిబ్బంది దేశంలోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు. వారికి రిజిస్టర్ పోస్టు ద్వారా పోస్టల్ బ్యాలెట్ పంపుతారు. పోస్టల్ బ్యాలెట్ కోసం దివ్యాంగులు, వయోవద్ధులు 12డీ దరఖాస్తు ఫారం నింపి రిటర్నింగ్ అధికారికి అందించాల్సి ఉంటుంది.

యువత క్రీడలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - రేణిగుంట : యువత చదువుతో పాటు క్రీడపై దృష్టి సారించాలని వేమాపురం సంజీవరెడ్డి మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు, విప్పమానుపట్టెడు సర్పంచ్ లక్ష్మీపతి రెడ్డి తెలిపారు. సోమవారం విప్పమానుపట్టడలో వేమపురం సంజీవరెడ్డి మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో క్రీడలను సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీపతి రెడ్డి మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా తమ సొసైటీ ద్వారా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. యువతకు విద్యతో పాటు ఆటలు కూడా ఎంతో అవసరమన్నారు. గ్రామ పంచాయతీ యువతకు వాలీబాల్ పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో నాలుగు టీములు పాల్గొనగా రెండు టీముల ఫైనల్ వచ్చాయన్నారు. రెండు టీమ్‌లకు నగదు బహుమ తితో పాటు విన్నర్స్, రన్నర్స్‌కు ప్రైజులు అందించామన్నారు. ఆటల పోటీ ల్లో గ్రామపంచాయతీకి చెందిన దాదాపు 50 మంది యువకులు పాల్గొన్నారని సర్పంచ్ తెలిపారు.

బహుమతులు అందుకుంటున్న క్రీడాకారులు

పోతుగుంట రాజేష్‌నాయుడు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన యువకులు

కాంగ్రెస్‌లో యువత చేరిక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఏర్పేడు మండలం కోబాక గ్రామానికి చెందిన పెద్ద సంఖ్యలో యువకులు కాంగ్రెస్‌లో చేరారు. ఇండియా ఫోరమ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పోతుగుంట రాజేష్ నాయుడు నివాసంలో వీరంతా సోమవారం కాంగ్రెస్ గూటికి చేరారు. రాజేష్ నాయుడు యువతకు సాదర స్వాగతం పలికి పార్టీలోకి ఆహ్వానించారు. మోడీ పాలనలో పతనమవుతున్న దేశ సమగ్రతను కాపాడేది కాంగ్రెస్ మాత్రమేనని, యువత ఆ లక్ష్యం కోసం పాటుపడాలని రాజేష్ నాయుడు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నేత జనమాల గురవయ్య పాల్గొన్నారు.

వైసిపి నుండి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: యర్రావారిపాలెం మండలంలోని నెరబైలు గ్రామ పంచాయతీ చింతకాయల హరిజనవాడలో వైసిపికి చెందిన 50 కుటుంబాలు ఉమ్మడిగా సోమవారం చేరాయి. చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని పాకాల లోని తన స్వగృహంలో వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ ఎన్నికల్లో పులివర్తి నాని విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింతకాయల శివకుమార్ , సుబ్రహ్మణ్యం, వెంకట్రామయ్య, మణి, సుబ్రహ్మణ్యం, భాను, సిద్దయ్య, మహేష్ , దిలీప్, రాజేష్, సుధాకర్ పాల్గొన్నారు.

రేణిగుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపిడివో విష్ణుచిరంజీవి

అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-ప్రజాశక్తి- రేణిగుంట : ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియో గించుకోవాలని ఎంపీడీవో విష్ణు చిరంజీవి తెలి పారు. సోమవారం పట్టణంలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా అధికారులు భారీ ర్యాలీ నిర్వహిం చారు. ఎంపీడీవో కార్యా లయం నుండి బస్టాండ్ సెంటర్ మీదుగా ప్లకార్డు బ్యానర్లు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విష్ణు చిరంజీవి మాట్లాడుతూ ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవడం బాధ్యత అన్నారు. మన ఓటు నిజాయతీకి తొలిమెట్టు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో నాగేశ్వరరావు, ఈఓపిఆర్డి వెంకట రత్నమ్మ, నోడల్ ఆఫీసర్, పంచాయతీ సెక్రటరీలు, బిఎల్వోలు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి -వెంకటగిరి: వెఎస్‌ఆర్ అభ్యర్థి రాంకుమార్ రెడ్డి మాట తప్పని వ్యక్తి అని 14వ వార్డు కౌన్సిలర్ శంకరయ్య తెలిపారు. సోమవారం 14 వార్డులోని బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ దగ్గర ఉన్న మాతమ్మ గుడి వద్ద పూజలు నిర్వహించి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 14 వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య ప్రతి ఇంటికి వెళ్లి జగన్మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. వెంకటగిరికి 16 మంది ఎమ్మెల్యేలు మారినప్పటికీ వెంకటగిరి అని చెప్పుకోవడానికి ఒక నేదురుమల్లి జనార్దన్ రెడ్డి, రాజ్యలక్ష్మి తప్ప మరెవ్వరు శాశ్వత అభివృద్ధి పనులు చేసిన దాఖలాలే లేవని నేదురు మల్లి కుటుంబం వెంకటగిరి చేసిన మేలు కొన్ని శతాబ్దాలు చెప్పుకోదగిందన్నారు. అదే బాటలో మనం

నమ్ముకున్న నాయకుడు నేదురుమల్లి కుటుంబ వారసుడు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ఇప్పుడు వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా వారి తల్లిదండ్రుల పరిపాలనను మళ్లీ తిరిగి వెంకటగిరి ప్రజలకు అందిస్తారని ఆయనను ఆదరించాలని కోరారు. పార్టీలకు అతీతంగా, కులాలకు అతీతంగా, మతాలకతీతంగా జగన్మోహన్ రెడ్డి చేసిన మేలును ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకుని ఆయనకు మళ్లీ ముఖ్యమంత్రిగా అవకాశం ఇవ్వాలని కోరారు.

వైసిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి-నాయుడుపేట: రానున్న ఎన్నికల్లో వైసిపి విజయానికి కృషి చేస్తామని సూళ్లూరుపేట నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కిలివేటి సంజీవయ్యను అత్యధిక మెజారిటీతో మూడవసారి గెలిపించుకుంటామని నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ తమ్మిరెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి అన్నారు. సోమవారం నాయుడుపేట పట్టణంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎంపి మద్దిల గురుమూర్తి ప్రారంభించిన ఎన్నికల ప్రచార యాత్రలో పాల్గొనేందుకు వారు తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి నివాసం నుండి సుమారు వెయ్యి మందితో భారీ ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. నాయుడుపేట పట్టణంలోని విజయ గణపతి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసిన అనంతరం జరిగిన ఎన్నికల

ప్రచారం నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

ప్రచార యాత్రలో వారు పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతిపక్ష ఎన్ని కుట్రలు చేసినా వైసిపి విజయాన్ని ఆపలేవన్నారు. ఈ కార్యక్రమంలో టిఎంఆర్ గ్రూప్స్ అధినేత తంబిరెడ్డి మోహన్ రెడ్డి, వైసిపి నాయకులు తంబిరెడ్డి మధుసూదన్ రెడ్డి, తంబిరెడ్డి సురేష్ రెడ్డి, నాగిరెడ్డి.చంద్రశేఖర్ రెడ్డి, నాగిరెడ్డి. ప్రవీణ్ కుమార్ రెడ్డి పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

యర్రావారిపాళెంలో అవగాహన కల్పిస్తున్న తహశీల్దారు

తిరుపతి డెస్క్: రానున్న ఎన్నికలలో ప్రతి ఒక్కరూ ఓటరు ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరుతూ యర్రావారిపాళెం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో అన్ని శాఖల అధికారులు , విద్యార్థులు సోమవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ రానున్న ఎన్నికలలో ఓట్లు వేసి ఓటింగ్ శాతం పెంచాలన్నారు. ప్రజాస్వామ్యంలో తమ ఓటు ద్వారా సరైన నాయకుడిని ఎన్నుకోవాలని ఎంఈఓ బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో , డిటి మహేశ్వరి, ఎస్ఐ ఈశ్వరయ్య, ఆర్ ఐ జానకిరామ్, వీఆర్వో మస్తాన్, వెలుగు ఏపీఎం గంగయ్య, సెక్రటరీలు పాల్గొన్నారు.

ప్రచారంలో పాల్గొన్న రాజ్యలక్ష్మి

పిలిస్తే పలుకుతా: మాజీ మంత్రి

ప్రజాశక్తి -బాలాయపల్లి : అందరూ మంచి మనసుతో ఆలోచించి రామ్ కుమార్ రెడ్డికి ఓటు వేసి గెలిపిస్తే అందరిపై పిలిస్తే పలుకుతానని మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం మండ లంలోని అంబలపూడి, నిండలి, వాక్యం గ్రామాలలో విస్తృత పర్యటన కార్యక్రమం మండల కన్వీనర్ కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధిని ఓటు వేయాలని కోరారు. ఏ సమస్య వచ్చినా వెంటనే తెలిపితే పరిష్కరిస్తానని తెలిపారు. బాలాయపల్లి మండలాన్ని తాము ఉన్నప్పుడే అభివృద్ధి చేశామని, ఇప్పటికీ అలానే ఉండాలి గతంలో పరిపాలించిన వాళ్లు ఏం చేశారని ప్రశ్నించారు. బాలయ్య పల్లి మండలంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్నారు. కొంతమంది గారడీ మాటలు చెప్పే వాళ్లని నమ్మొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలపార్టీ కన్వీనర్ వెందోటి. కార్తీక్ రెడ్డి, మండల జేఏసీ ఇన్‌ఛార్జి తాళ్లూరు వెంకట బంగారు ప్రసాద్ చౌదరి(బాబి), వైసిపి నాయకులు వెంకటరమణారెడ్డి, పల్లంటి రాంబాబు నాయుడు, గోపాల్ యాదవ్, మల్లేల వెంకటేశ్వర్లు నాయుడు, బాబు రెడ్డి, రాజేష్ రెడ్డి, గంగధర్,మాధవ, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

బొజ్జల సేవలు మరువలేనివి: ఎంజి రాజేష్ రెడ్డి

ప్రజాశక్తి- రేణిగుంట : మాజీ మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి రాష్ట్రానికి, శ్రీకాళహస్తి నియోజక వర్గానికి చేసిన సేవలు మరువలేనివని టిడిపి యువ నాయకుడు ఎంజిరెడ్డి పేర్కొన్నారు. . పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద బొజ్జల గోపాల కృష్ణారెడ్డి 76వ జయంతిని టిడిపి నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. టిడిపి నాయకులు భారీ కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా టిడిపి యువ నాయకుడు ఎంజీ రెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజక వర్గానికి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి చేసిన సేవలు మరవలేమన్నారు. రాష్ట్ర మంత్రిగా, శ్రీకాళహస్తి నియోజక వర్గ శాసన సభ్యులుగా ఆయన ఎనలేని కీర్తి పొందారన్నారు. ఆయన సేవలు నేటికి స్మరించుకుంటున్నారని ఎంజి రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, పట్టణాధ్యక్షుడు మహబూబ్ బాషా, సీనియర్ నాయకులు మునస్వామి నాయుడు, చెర్లోపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, పుష్ప నాదం, నెల్లూరు సుబ్రమణ్యం, మాజీ సర్పంచ్ జ్యోతినారాయణ, మాజీ ఎంపిటిసి గజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

కేక్ కట్‌చేసి తినిపించుకుంటున్న టిడిపి నాయకులు

నేడు మేరిగ మురళి ప్రచారం ప్రారంభం

ప్రజాశక్తి -కోట : గూడూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళి ప్రచారాన్ని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి శ్యాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నుండి ప్రారంభించనున్నట్లు మాజీ జెడ్పిటిసి ఉప్పల ప్రసాద్ గౌడ్ తెలిపారు. మాజీ జెడ్పిటిసి ఉప్పల ప్రసాద్ గౌడ్ సోమవారం మాట్లాడుతూ కోట మండలంలో మొదట కొత్తపట్నం నుండి ప్రారంభించి అనంతరం తదితర గ్రామాల్లో ప్రచారం కొనసాగిస్తామని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలోరాష్ట్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తామని తెలిపారు.

వాలంటీర్లను రాజీనామా చేయించడం తగదు: పాశిం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వైసీపీ ప్రభుత్వం వాలంటీర్లను బెదిరింపులకు గురి చేసి రాజీనామాలు చేయిస్తున్నారని టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని గమళ్ళ పాలెంటిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వాలంటీర్లను బెదిరించి రాజీనామా చేయిస్తోందని, ప్రజలకు సేవ చేసే వాలంటీర్లకు టిడిపి అధికారంలో రాగానే పదివేల రూపాయల గౌరవ వేతనం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శీలం కిరణ్ కుమార్, భాస్కర్ రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, రహీం, వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

ఉప విద్యాశాఖాధికారి బాధ్యతల స్వీకరణ

ఉద్యోగ బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రభాకర్‌రాజు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తిరుపతి జిల్లా పుత్తూరు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారిగా. హెచ్ ప్రభాకర్ రాజు సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరిం చారు. గతంలో నారాయణ వనం ఎంఈఓ, ఎఫ్ఎస్ఓ గా బాధ్యతలు నిర్వర్తించారు. డివిజ న్ విద్యాశాఖ అధికారిగా సోమవారం బాధ్యతలు స్వీకరిం చారు. ఆయనకు డివిజన్ లోని మండల విద్యాశాఖ అధికారి, ప్రధానోపాధ్యాయులు, వ్యాయమ ఉపాధ్యా యులు అభినం దించారు.

'టీఆర్ కండ్రిగ ఏపడబ్ల్యూ అభివృద్ధి టిడిపికే సాధ్యం'

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : టిఆర్ కండ్రిగ ఏపడబ్ల్యూ అభివృద్ధి టిడిపికే సాధ్యమవుతుందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. రూరల్ మండలం తడుకు గ్రామ పంచాయతీ టిఆర్ కండ్రిగలో వైసిపికి భారీ షాక్ తగిలింది, టిఆర్ కండ్రిగ ఏపడబ్ల్యు కు చెందిన వంద మంది అధికార ఎవైసిపిని వీడి పుత్తూరు రూరల్ క్లస్టర్ ఇన్‌ఛార్జి గంజి మాధవయ్య, తడుకు సర్పంచ్ బొబ్బిలి యాదవ్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. వీరికి నగరి నియోజకవర్గ టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ పార్టీ కండువాలు వేసి అభినందించారు. టీఆర్ కండ్రిగ ఏపడబ్ల్యూ వాసులు భానుప్రకాష్ తో మాట్లాడుతూ పార్టీలో చేరిన వారందరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు వెంకటముని, రవి, హరి, రమేష్, వినోద్, విజయ్ కుమార్, ఎమ్మెస్ రవి, హరికృష్ణ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టిడిపిలో చేరిక

టిడిపి పట్టణ ప్రకార్యదర్శి, క్లస్టర్ ఇన్‌ఛార్జి బిఎన్ఎన్ ధనపాల్ జన్మదిన వేడుకలు గేట్ పుత్తూరు (క్యాబిన్ సర్కిల్) వద్ద యువకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి

అందరికీ పంచిపెట్టారు. డిజి ధనపాల్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత కోఆర్డినేటర్ పదో వార్డు ఇన్‌ఛార్జి డిజీ ధనపాల్, యువకులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఆక్రమణలు

- ఆర్అండ్బి స్థలాల్లో భారీ వృక్షాలు నరికివేత - పట్టించుకోని అధికారులు
- రాజకీయ, అధికార బలంతో పెరిగిపోతున్న అక్రమార్కుల ఆగడాలు

ప్రజాశక్తి-నాయుడుపేట: నెల్లూరు, తిరుపతి, చెన్నై నగరాలకు కూడలి ప్రాంతమైన నాయుడుపేట పట్టణం ఇటీవల కాలంలో నలువైపులా విస్తరించింది. దీనికి తోడు వ్యాపార కూడలి ప్రాంతం అయిన నాయుడుపేట పట్టణంలో స్థిరపడేందుకు చుట్టుపక్కల పలు మండలాల ప్రజలు ఉత్సాహం చూపిస్తుండడంతో నాయుడుపేటలో స్థలాలు, పొలాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. నాయుడుపేట మండలంలోని మేనకూరు సెజ్ సుమారు 25 కు పైగా జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలు ఏర్పడడంతో అక్కడ పనిచేసే కార్మికులు, సిబ్బంది నాయుడుపేట పట్టణంలో నివాసం ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు వస్తున్నారు. దీంతో పట్టణ పరిసర ప్రాంతాల్లో భూముల ధరలు పెరిగి ఎకరా ఐదు కోట్ల రూపాయల పలుకుతోంది. ఈ నేపథ్యంలో ఆక్రమణల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది.

పెరిగిపోతున్న అక్రమార్కుల ఆగడాలు

అంగ బలం, ఆర్థిక బలానికి తోడు రాజకీయ బలం ఉంటే ఏదైనా చెల్లుబాటు అవుతుందన్న ధోరణితో కొందరు నాయుడుపేటలో ఆక్రమణలకు పాల్పడుతున్నారు. అధికారులు, నాయకుల అండదండలు వారికి పుష్కలంగా లభిస్తున్నాయి. ప్రభుత్వ స్థలాలను, అసైన్మెంట్ భూములను ఆక్రమించి కొందరు రియల్ ఎస్టేట్ వెంచర్లు చేస్తుండగా, మరికొందరు రోడ్డు మార్జిన్లను, ఆర్అండ్బి స్థలాలను ఆక్రమించి బాహాటంగానే భవన నిర్మాణాలు చేపడుతున్నారు. అంతటితో ఆగకుండా ఆర్ అండ్ బి స్థలాల్లో ఉన్న భారీ వృక్షాలను సైతం నిర్భయంగా నరికివేసి తరలిస్తున్నారు. నాయుడుపేట పట్టణంలో అక్రమణ లు జోరందుకున్నాయన్న విమర్శలే కాదు ఆధారాలు సైతం కనిపిస్తున్నా అధికారులు తమకు సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. రోడ్డు మార్జిన్లను ఆర్ అండ్ బి స్థలాలను ఆక్రమించి భవన నిర్మాణ చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించకపోవడంలో ఆంతర్యం ఏమిటని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నాయుడుపేట పట్టణంలో విస్తరించి ఉన్న ప్రధాన డ్రైనేజీ సైతం వ్యాపారస్తుల చేతుల్లో పడి చిన్న కాలువగా మారిపోతున్నప్పటికీ అధికారులకు అటువైపు చూడాలన్న ఆలోచన కూడా ఉన్నట్టుగా కనిపించడం.శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేసిన బ్రాందీ షాపు వద్ద నుండి జువ్వలపాలెం రోడ్డు పై ఓవర్ బ్రిడ్జి వరకు సుమారు 50 అడుగులు వెడల్పు ఉండాల్సిన ప్రధాన డ్రైనేజీ కాలువ ఆక్రమణలతో కుంచించుకుపోయి పంట కాలువను తలపిస్తోంది. జువ్వలపాలెం రోడ్డు సమీపంలో గత మూడు రోజుల క్రితం డ్రైనేజీ కాలువ పక్కన ఆర్ అండ్ బి స్థలంలో ఉన్న భారీ వృక్షాలను అక్రమంగా నరికి తరలించారు.బారీ వృక్షాలను నరికి ఆక్రమించిన స్థలంలో భవన నిర్మాణం చేపట్టి నిర్మాణాలు పూర్తి చేస్తున్నప్పటికీ ఏ మాత్రం చెలించని అధికారులు వీటిపై సర్వత్ర ప్రజల్లో పలు అనుమానాలకు దారి తీస్తున్నాయి. ఆర్ అండ్ బి స్థలంలో డ్రైనేజీ కాలువ పక్కన భారీ వృక్షాలను నరికి తరలించడంతో పాటు ఆ స్థలంలో భవన నిర్మాణం చేపడుతున్నారని నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ కు స్థానికులు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

కమిషనర్ వివరణ

దీనిపై మున్సిపల్ కమిషనర్ జనార్దన్ రెడ్డిని వివరణ కోరేందుకు పలుమార్లు ప్రయత్నించినా ఆయన స్పందించకపోవడం గమనార్హం. ఆర్ అండ్ బి స్థలంలో భారీ వృక్షాలను నరికి తరలించినప్పటికీ వారిపై ఆర్ అండ్ బి శాఖ, మున్సిపల్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని, ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన అవసరం ఉందని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఇవేకాక మండలంలోని పలు ప్రభుత్వ భూములు అక్కడ వీఆర్వోల సహాయంతో పలువురు నాయకుల,ు వ్యాపారస్తులు ఆక్రమించుకొని యథేచ్ఛగా అమ్మేసుకుంటున్నా ఏ ఒక్క అధికారి పట్టించుకోకపోవడం విశేషం. దీనిపై పత్రికల్లో పలుమార్లు రాసినప్పటికీ అధికారులు స్పందించక పోవడంతో అక్రమార్కుల జోరు మరింత పెరుగుతోంది. దీనికి అధికారులు అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్తులో ప్రభుత్వ భూమి అనే పదం కూడా కనుమరుగయ్యే ప్రమాదం వుంది.

21న ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: కెవిబి పురం మండలంలోని ఆదర్శ పాఠశాలలో2024-2025 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశం నిమితం పరీక్షను ఈ నెల 21వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రవేశ పరీక్ష 5 వ తరగతి స్థాయిలో ఉంటుందని తెలుగు-ఇంగ్లీష్ మాధ్యమంలో ఉంటుందని తెలిపారు. ఆన్లైన్లో అప్లై చేసిన విద్యార్థులు ఆధార్ కార్డు, జిరాక్స్, హాల్ టికెట్ తీసుకుని ఈ నెల 21వ తేదీ 8.30 గంటలకు ఆదర్శ పాఠశాలకు రావాలని ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

ఏర్పేడు ఎంపిడివోకు రాజీనామా పత్రాలు అందిస్తున్న వలంటీర్లు

ఐదుగురు వలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: ఏర్పేడు గ్రామ పంచాయతీలో సోమవారం ఐదు గురు వలంటీర్లు రాజీనామా చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు మద్దతుగా ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా వాలంటీర్లు స్వచ్ఛందంగా తమ పదవికి రాజీనామా చేశారు. ఏర్పేడు గ్రామపంచాయతీకి చెందిన ఎన్ అరుణ, కె జ్యోతి, జి భూలక్ష్మి , ఎం శ్రీవిద్య ఎంపీడీవో గిడ్డయ్యకు రాజీనామా పత్రాలు అందించారు. ముఖ్యమంత్రిగా మళ్లీ వైయస్ జగన్మోహన్ రెడ్డిని శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా బియ్యపు మధుసూదన్ రెడ్డిని గెలిపించుకుంటామని వారన్నారు.

చీరలు పంపిణీ చేస్తున్న దాతలు

చీరలు పంపిణీ

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని నారాయణవనం మండలంలోని బ్రాహ్మణతాంగల్ పంచాయతీలో జీవనజ్యోతి సొసైటీ ఆధ్వర్యంలో జీవనజ్యోతి సొసైటీ ప్రసిడెంట్ కట్టమంచి చిన్నప్ప, ఉపాధ్యక్షులు వి ఎం వడివేలు పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించే అందుకు తమ సొసైటీ ద్వారా పేద మహిళలకు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎం ఈ ఓ జయరాం రావు, నగరి కట్టమంచి చిన్నప్ప. సర్పంచ్ గుణశేఖర్, వెంకటేష్, గోపాల్, డాక్టరేట్ గుణశేఖర్, వెలుగు సిసి షర్మిల గాంధీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కలిమిలి రాం ప్రసాద్ రెడ్డి పై సస్పెన్షన్ ఎత్తివేత

ప్రజాశక్తి-వెంకటగిరి: కలిమిలి రాం ప్రసాద్ రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేయనున్నారు. వైసిపి బహిష్కృత నేత కలిమిలి రాంప్రసాద్ రెడ్డి నివాసంలో వైసిపి రాష్ట్ర నాయకులు మక్కిలి రామచంద్రారెడ్డి(ఎంపిఎక్స్ రెడ్డి), వెంకటగిరి నియోజకవర్గ పరిశీలకులు కొడవలూరు ధనుంజయ రెడ్డి కలిమిలితో సోమవారం చర్చలు నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్సి రెడ్డి మాట్లాడుతూ పార్టీ అభిప్రాయ భేస్త్రదాలు కారణంగా కొంతకాలంగా కలిమిలి పార్టీకి దూరంగా ఉన్నారని వాటిని పరిశీలించాలని రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కోరగా 15 రోజుల వ్యవధి అడిగినట్లు తిరుపతి పార్లమెంటు పరిధిలోని ఈ మూడు నియోజక వర్గాల్లో పార్టీలోనే అసంతృప్తి వాదులతో చర్చలు జరిపి సవరించినట్లు తెలిపారు. రెండు రోజుల్లో రామ్ కుమార్ రెడ్డి కలిమిలితో కలిసి మాట్లాడతారని పార్టీ కోసం పని చేసే వారిని ఎప్పుడూ వదులుకోదని పార్టీ కోసం మొదటి నుంచి కష్టపడిన ఎలాంటి నాయకులను పార్టీ వదులుకోరని, వారికి తగిన ప్రాధాన్యం, తగిన గుర్తింపు ఇస్తుందని తెలిపారు. అనంతరం నియోజకవర్గం 163 పరిశీలకులు కొడవలూరు ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ కలిమి రాంప్రసాద్ రెడ్డి సేవలు పార్టీకి ఎంతో అవసరం విషయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకో పోవడంతో వారు వెంటనే స్పందించి తిరిగి పార్టీలోకి తీసుకోమని ఆదేశించడంతో నేడు పార్టీలో తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం కలిమిలి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ మొదటి నుంచి పార్టీ కోసం కష్టపడి పనిచేస్తానని ఇప్పుడు కూడా పార్టీ కోసం కష్టపడి పని చేసి జగన్మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి చేసి కార్యక్రమంలో తాను పాలు పంచుకుంటానని తెలిపారు.

మీడియాతో మాట్లాడుతున్న వైసిపి పరిశీలకులు ధనుంజయరెడ్డి

మీడియాతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ఓటమి భయంతోనే థామస్పై దాడి

- శ్రీధర్ యాదవ్

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో వైసిపి ఓడిపోతుందన్న భయంతోనే టిడిపి థామస్ పై దాడి చేయించారని జిల్లా సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్ సోమవారం అన్నారు. ప్రజల్లో థామస్ కి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఇక గెలవలేమన్న ఉద్దేశంతో దాడికి పాల్పడినట్లు ఆయన అన్నారు. ఎన్నికల ప్రచారం మొదటి నుండి ఆయనపై పలు ఆరోపణలు చేసిన వైసిపి నాయకులు ఇక ఓడిపోతామని నిర్ణయించుకోవడంతో దాడి చేయించారన్నారు. ధైర్యంగా ఎదుర్కొని ప్రజా ఆదరణ పొంది ఓట్లు సంపాదించి గెలవాలి, దాడి చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో కటిక పల్లి మాజీ సర్పంచ్ వరదరాజులు యాదవ్ నెల్లేపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, టిడిపి కొత్తపల్లి మిట్ట సూరి రెడ్డి పాల్గొన్నారు.

వసుమతి దేవి ఆశయాలను కొనసాగిస్తాం

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు

ప్రజాశక్తి -చిత్తూరు డెస్క్: వసుమతి దేవి ఆశయాలను కొనసాగిస్తామని, పేద ప్రజలకు కార్మికులకు నిరంతరం అండగా ఉండటం, ఆమె ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు పిలుపు నిచ్చారు. సోమవారం సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ సతీమణి దేవో వసుమతి దేవి వర్థంతి కార్యక్రమాన్ని నగరిలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ కార్యదర్శి వేలన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వసుమతి దేవి చిత్రపటానికి ఘనంగా పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు పార్టీ చిత్తూరు జిల్లాలో, రాష్ట్రంలోగాని విస్తరించడంలో కీలక పాత్ర పోషించిందని, కార్యకర్తలను తన సొంత బిడ్డల్లాగా చూసుకొని చేరదీసి ఉద్యమం పట్ల సాహిత్య పరంగా వారిని తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. అటు పార్టీని బ్యాలెన్స్ చేస్తూ నారాయణ జాతీయ స్థాయిలో ఎదగడానికి ఆమె పాత్ర కీలకమైందన్నారు. రాష్ట్రంలో ఉన్న పేదల సమస్యల పై, కార్మిక సమస్యల పై ప్రధానంగా మహిళా సమస్యల పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. అనేక రకమైన

పోరాటాల్లో కార్యకర్తలను కాపాడుతూ వారికి అండగా ఉంటూ ఉద్యమ నిర్మాణంలో భాగస్వాములైనారని గుర్తు చేశారు. ఆమె ఆశయాలకు అనుగుణంగా ప్రజలు కు నిత్యం అందుబాటులో ఉన్నప్పుడు అప్పుడే ఆమెకు నిజమైన నివాళులర్పించిన వారు అవుతామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జనార్ధన్, ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, ఆ పార్టీ పట్టణ కార్యదర్శి వేలన్, ఏఐటియుసి నాయకులు మురళి, నాగరాజు, విజయ్, కుమార్, సతీష్, రాజేంద్ర, నాయకులు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న గాలి భానుప్రకాష్

టిడిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: నగరి మున్సిపాల్టీలోని ఏకాంబరకుప్పంలో నగరి నియోజకవర్గ టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను గెలిపించాలని అభ్యర్థించారు.

అడల్ట్ దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: అడల్ట్ దోమల నివారణకు చర్యలు చేపట్టినట్లు జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం చిత్తూరులో ప్రత్యేక బృందం "అడల్ట్ దోమల నివారణకు మలాథియాన్ ఫోకల్ స్ప్రే" నిర్వహించారు. చిత్తూరు నగరం, ప్రశాంత్ నగర్ అర్బన్ హెల్ప్ సెంటర్ పరిధిలోని సావిత్రమ్మ కాలేజీ వెనుకబడిన తరగతుల బాలికల హాస్టల్లో వార్డెన్ సమక్షంలో హాస్టల్ లోపలి భాగాలలో గోడలలో నివసిస్తున్న అడల్ట్ దోమల నివారణకు మలాథియాన్ స్ప్రే చేయించారు. తద్వారా పూర్తిగా దోమల నివారణతో మలేరియా, డెంగీ నివారించ వచ్చునని ఆయన స్పష్టం చేశారు. అలాగే కిటికీలకు మెస్లు వేయించాలని ప్రిన్సిపల్‌కి సిఫారసు చేశారు. అలాగే బాలికలకి దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులు, నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎంఓ రామచంద్రారెడ్డి, సబ్ యూనిట్ అధికారి రామకృష్ణ, సూపర్వైజర్ నారాయణ, హాస్టల్ వార్డెన్ కరుణ, స్టాఫ్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-సదుం: మండలంలోని అమ్మగారి పల్లి పంచాయతీ కలకటవారిపల్లిలో "శ్రీ కోదండరామస్వామి దేవస్థానం"లో సీతారాములు, ఆంజనేయులు స్వామివారి విగ్రహాలు ప్రతిష్ట, మహా కుంభాభిషేకం, కళ్యాణోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన జర్నలిస్ట్ గొర్రెపర్తి ప్రభాకర్, చంద్రకళ దంపతులు, వడ్డి చంద్రశేఖర్, పుష్ప దంపతులు ఉభయదారులుగా శ్రీరామనామ హోమం, కుంభాబిషేకం, సుదర్శన హోమం, కళ్యాణోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు.

17న కుప్పం

రెడ్డమ్మ సాహితీ పురస్కార సభ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: శ్రీరామనవమి సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించిన రచయితలు, కవులతో కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కార సమావేశం బుధవారం చిత్తూరు దొరస్వామి అయ్యంగార్ రోడ్డులోని రాజామహల్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రోజాప్రియా, డాక్టర్ నిరంజన్‌రెడ్డిలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం 5గంటలకు ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ కె.రామలక్ష్మిగారి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా కట్టమంచి బాలకృష్ణారెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో ఉత్తమ రచనలుగా ఎంపికైన వారికి బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందని వెల్లడించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కవులు, రచయితలు, సాహితీవేత్తలు, సాహితీ పోషకులు కళాకారులు, సంఘ సేవకులు, స్థానిక ప్రముఖులు సకాలంలో హాజరై సాహితీ సభను విజయవంతం చేయాలని కోరారు.

టీడీపీ నేతకు సన్మానం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్‌ని నియోజకవర్గ బీసీ నాయకులు సోమవారం సన్మానించారు. రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఎంపిక కావడంపై అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీధర్ యాదవ్, సూరి రెడ్డి, వరదరాజులు, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్‌కి ప్రాధాన్యం

- రహదారుల్లో బ్లాక్‌స్పాట్ల వద్ద ప్రత్యేక చర్యలు
- పెండింగ్ కేసుల్లో పురోగతి కనిపించాలి
- సామాన్యులకు భరోసాగా నిలవండి
- ఎస్ఆర్ పురం పోలీస్‌స్టేషన్ తనిఖీలో సిబ్బందికి ఎస్పీ మణికంఠ చందోలు దిశానిర్దేశం

ఎస్ఆర్ పురంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్, ఎస్ఆర్ పురం: విజిబుల్ పోలీసింగ్‌కి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి సామాన్యులకు భరోసాగా ఉండాలని పోలీసులకు చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు దిశానిర్దేశం చేశారు. సోమవారం ఎస్ఆర్ పురం, జీడీ నెల్లూరు పోలీస్‌స్టేషన్‌లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైం రికార్డుల నిర్వహణకు సంబంధించి క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న క్రైం కేసుల పురోగతిపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు బ్లాక్ స్పాట్ల వద్ద ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టేషన్ పరిధిలోని పాఠశాలలు, హోటల్స్, లాడ్జీలు వంటి ప్రదేశాల్లో నిఘా పటిష్టం చేయాలన్నారు. ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు జాగ్రత్తగా తీసుకోవాలన్నారు. రౌడీ షీటర్ల కదలికలు, కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం స్టేషన్ సిబ్బంది, మహిళ పోలీసులతో పలు అంశాలకు సంబంధించి చర్చించి ప్రస్తుత పరిస్థితులను ఆరాదీశారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ తనిఖీల్లో జీడీ నెల్లూరు ఇన్స్‌పెక్టర్ మారుతీశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎన్నికల ప్రచారం

టీడీపీ ప్రచార రథంలో నాట్యం చేస్తున్న కళాకారులు

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: టీడీపీ చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమల్ల ప్రసాదరావు నేతృత్వంలో భారీ వాహనంలో కళాకారుల ద్వారా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. సోమవారం జీడీ నెల్లూరులో కళాకారులు టీడీపీ ఆశయాలు, సిద్ధాంతాల కోసం ఓటేయాలని కోరుతూ పాటలు పాడుతూ నాట్యం చేశారు. ఎంపీ అభ్యర్థి ప్రసాద్‌రావు, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. వినూత్నంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు ఆసిక్తిగా తిలకించారు. కళాకారులతో ఎన్నికల ప్రచారం పలువురిని ఆకట్టుకుంది.

అమరుల త్యాగం చిరస్మరణీయం

- ఘనంగా అగ్నిమాపక వారోత్సవాలు
- పుంగనూరులో భారీ ప్రదర్శన, అవగాహన ర్యాలీ

కార్యక్రమంలో మాట్లాడుతున్న అగ్నిమాపక అధికారి సుబ్బరాజు

ప్రజాశక్తి-పుంగనూరు: విధి నిర్వహణలో అమరులైన అగ్నిమాపక సిబ్బంది త్యాగం చిరస్మరణీయం అని పుంగనూరు అగ్నిమాపకశాఖ అధికారి సుబ్బరాజు అన్నారు. సోమవారం రెండవ రోజు వారోత్సవ కార్యక్రమంలో భాగంగా పుంగనూరులో అవగాహన ర్యాలీ, భారీ ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాధి 14 నుంచి 20వ తేదీ వరకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 1944 ఏప్రిల్ 14న ముంబైలో జరిగిన అగ్ని ప్రమాదంలో విధినిర్వహణలో అమరులైన వారిని స్మరించుకుంటూ ప్రతి ఏటా ఈ వారోత్సవాలు జరుపుకొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పుంగనూరు పట్టణంలో అగ్నిప్రమాదం సంబవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. భారీ ప్రదర్శన చేశారు. అగ్నిమాపక సిబ్బంది చేపట్టిన విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం..

- గుడిపాలకు గార్మెంట్స్, షూ కంపెనీలు తెస్తాం
- అడవిపల్లి రిజర్వాయర్ ద్వారా చిత్తూరుకు తాగునీరు
- ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటుకు కృషి
- చిత్తూరును గ్రీన్ సిటీగా తీర్చిదిద్దుతా..
- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ హామీ
- నియోజకవర్గ మ్యానిఫెస్టో విడుదల

మ్యానిఫెస్టోను విడుదల చేస్తున్న గురజాల జగన్‌మోహన్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లా కేంద్రంలో యూనివర్సిటీని ఏర్పాటు చేసి తీరుతాం అని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ అన్నారు. సోమవారం ఆయన ప్రత్యేకంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి చిత్తూరు నియోజకవర్గ మ్యానిఫెస్టోను విడుదల చేశారు. అందులో పేర్కొన్న ప్రతి హామీని నెరవేరుస్తానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన గుడిపాల మండలంలో గార్మెంట్స్, షూ కంపెనీలు తీసుకొచ్చి తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. చిత్తూరును గ్రీన్ సిటీగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటానని తెలిపారు. చిత్తూరుకు ప్రభుత్వ మెడికల్ కళాశాల తీసుకొస్తానని హామీ ఇచ్చారు. ఏళ్ల నాటి తాగునీటి సమస్య తీర్చేందుకు అడవిపల్లి రిజర్వాయర్ పనులు వేగవంతం చేసి చిత్తూరు నగర ప్రజలకు శాశ్వత తాగునీటి పరిష్కారం చూపుతానని చెప్పారు. విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఐఐటి, నవోదయ, కేంద్రీయ విద్యా సంస్థలు నెలకొల్పేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటానన్నారు. నగరంలో ఇన్నర్ రింగ్‌రోడ్డు నిర్మాణం చేపట్టి ట్రాఫిక్ సమస్య తీర్చడంతో పాటు నగర సుందరీకరణ చేపడతానన్నారు. అండర్ డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. నిరుపయోగంలో ఉన్న ప్రభుత్వ భూమిలో ఇండస్ట్రీయల్ హబ్ ఏర్పాటు ద్వారా స్థానిక యువతకే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఇంకా మ్యానిఫెస్టోలోని పలు అంశాలను ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు దొరబాబు, చంద్రప్రకాష్, కటారి హేమలత, మాజీ ఎమ్మెల్యే మనోహర, బిజెపి జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలను ఆదుకుంటా: మురళిమోహన్

ప్రజాశక్తి-ఐరాల: ఎన్నికల్లో టీడీపీకి ఓటేసి గెలిపిస్తే పేదలను ఆదుకుంటానని పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మురళిమోహన్ అన్నారు. సోమవారం మండలంలోని 35-ఎర్లంపల్లి పంచాయతీలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తాము అధికారంలోకి వస్తే చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ సైకిల్ గుర్తుకు ఓటేయాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్, దగ్గుమళ్ల సుధాకర్, గిరిధర్ బాబు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఏపీ పునర్నిర్మాణం చంద్రబాబుతోనే సాధ్యం: పూర్ణచంద్రారావు

ప్రజాశక్తి-గంగవరం, బైరెడ్డిపల్లి: ఏపీ పునర్నిర్మాణం చంద్రబాబుతో సాధ్యమని రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్స్ చైర్మన్ పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. పలమనేరు పట్టణంలోని మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి స్వగృహంలో సోమవారం చంద్రబాబు గెలుపు-పెన్షనర్ల పిలుపు పేరుతో ముద్రించిన కరపత్రాలను మాజీ మంత్రి అమర్నాథరెడ్డి, చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్ రావు ఆధ్వర్యంలో విడుదల చేశారు. గంగవరం మండలం కొత్తపల్లి పంచాయతీలో ఆలయ ప్రారంభోత్సవంలో అమరనాథ రెడ్డి పాల్గొన్నారు. అదే విధంగా బైరెడ్డిపల్లిలో చేపట్టిన కార్యక్రమంలో పలువురు టీడీపీలో చేరారు. వారికి టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా ఈ ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని చూసి ఓట్లయాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఓటర్లను కోరారు. ఎన్నికల ప్రచారం, ప్రజా ఆశీర్వాద పాదయాత్రలో భాగంగా సోమవారం 21, 24వ వార్డులో ఎమ్మెల్యే పర్యటించారు. తాను కష్ట కాలంలో శ్రీకాళహస్తి ప్రజలకు అండగా నిలబడ్డాననీ, మరి బొజ్జల సుధీర్ రెడ్డి ఐదేళ్లు ఎక్కడ ఉన్నారో చెప్పాలని ప్రశ్నించారు. తిరణాళ్ళకు వచ్చే ఖర్జూర వ్యాపారిలా ఏడాదికోసారి రావడం, హైదరాబాదులో మకాం వేయడం తప్ప నియోజకవర్గ ప్రజలకు ఆయన ఒరగబెట్టింది ఏమీ లేదని ప్రశ్నించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాసేవకు అంకితమైన తనకు మరోసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఏపీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మిద్దెల హరి, లోకేష్ యాదవ్, పగడాల రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

- మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ

సమీక్షలో తిరుపతి కలెక్టర్ ప్రవీణ్ కుమార్ వెలడి

ప్రజాశక్తి-తిరుపతిటౌన్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రసార మాధ్యమాల్లో రాజకీయ పార్టీల ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ ఛాంబర్‌లో ఆయన ఛైర్ పర్సన్ ఎంసిఎంసి హోదాలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సమీక్ష నిర్వహించి మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించి జిల్లా స్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి ఇవ్వడంతో పాటు, చెల్లింపు వార్తలను (పెయిడ్ న్యూస్) ఈ కమిటీ పర్యవేక్షిస్తుందని, మీడియా ఉల్లంఘనలు కూడా గుర్తించి తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. రిజిస్టర్ కాబడిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలు గానీ వారి తరఫున ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థులు ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలను ప్రసారం చేసేందుకు అనుమతి కోసం నిర్ణీత నమూనాలో మూడు రోజులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రిజిస్టర్ కానటువంటి రాజకీయ పార్టీలు, ఇతర వ్యక్తులు వారి ప్రకటన ప్రసారం చేయుటకు ఏడు రోజులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు అందిన రెండు రోజుల్లోగా జిల్లాస్థాయి ఎంసీఎంసీ కమిటీ సదరు ప్రచార అంశాలు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి అనుమతి మంజూరు చేస్తుందన్నారు. ఇప్పటి వరకు 258 ప్రతికూల వార్తలు పత్రికల్లో రాగా అందులో 251 వాటిపై చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు అందిన రాజకీయ పార్టీల ప్రకటనలకు, ప్రచార కంటెంట్‌కు 19 వాటికి ముందస్తు అనుమతులు మంజూరు చేశామన్నారు. ప్రింట్, మీడియాలో ప్రచురింపబడిన, ఎలక్ట్రానిక్ మీడియా లో టెలికాస్ట్ అయిన వార్తలను మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ద్వారా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై, పెయిడ్ న్యూస్‌పై నిరంతర నిఘా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంసిఎంసి మెంబర్ సెక్రెటరీ బాల కొండయ్య, ఆల్ ఇండియా రేడియో ప్రోగ్రాం మేనేజర్ సుధాకర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సౌండ్ పెంచితే.. సీజ్ చేయండి!

- ఆంక్షలకు లోబడే ప్రచారాలకు అనుమతి
- ఇంటింటి ప్రచారానికి సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారమివ్వాలి
- మే 10 లోగా, లేకుండా 15 తర్వాతనే గంగజాతర చేసుకోవాలి
- అధికారుల సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ కీలక ఆదేశాలు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షన్మోహన్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:

రాజకీయ పార్టీలు వాహనాల ద్వారా నిర్వహించే ప్రచారంలో ఎక్కువ శబ్దాలు చేస్తున్న వాహనాలను సీజ్ చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో జేసీ, 172 చిత్తూరు నియోజకవర్గం రిటన్నింగ్ అధికారి పి.శ్రీనివాసులు, డిఆర్ఓ బి.పుల్లయ్యతో కలసి సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఆర్ఓలు, ఏఆర్వోలు వివిధ రకాల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటి ప్రచారంకి సంబంధించి రాజకీయ పార్టీలు తప్పనిసరిగా సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈనెల 17న ఎన్నికల పరిశీలకులు జిల్లాకు రావడం జరుగుతుందని ఇప్పటివరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా వచ్చిన రిక్వెస్ట్ పరిమిషన్లుకు సంబంధించి పూర్తి వివరాలను ఉంచుకోవాలని సంబంధిత నోడల్ అధికారులను ఆదేశించారు. మే 13న జరగనున్న ఎన్నికల విధులు కేటాయించిన సుమారు 12,500 మంది ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కలిగించడం జరిగిందని తెలిపారు. క్రిటికల్, బార్డర్‌లో ఉన్న పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ వీడియో కవరేజ్ తప్పనిసరిగా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. 1771 పోలింగ్ కేంద్రాలకు కాను 1266 పోలింగ్ కేంద్రాల లోకేషన్‌లో వీల్ చైర్స్‌ను, బ్యారికెట్లను ఏర్పాటు చేయాలని సంబందించిన అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రతి సంవత్సరం నిర్వహించే గంగ జాతరకు సంబంధించి మోడల్ కోడ్ అప్ కాంటాక్ట్ ఉన్నందువల్ల మే నెల 10వ తేదీలోగా లేదా మే15 తేదీ తర్వాత గంగ జాతర నిర్వహించుకోవలన్నారు. గంగ జాతర నిర్వహణ సంబంధించి సంబంధిత పోలీస్‌స్టేషన్ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. రోడ్లును బ్లాక్ చేయడం, ప్రభుత్వ స్థలాల్లో రాజకీయ పార్టీల నాయకుల ఫొటోలు ఏర్పాటు చేయరాదన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా గంగజాతర నిర్వహించుకోవాలన్నారు. అనంతరం ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలకు పార్టీ అభ్యర్థుల నామినేషన్లు వేసే సమయంలోను, నామినేషన్ల పరిశీలన, నామినేషన్లు ఉపసంహారణ సమయంలో ఆర్వోలు చేయవలసినవి, చేయకూడని అంశాలకు సంబంధించి విశ్రాంత జెసి వి.ఆర్.చంద్రమౌళి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడు నియోజకవర్గాలకు సంబంధించి రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, వివిధ రకాల టీమ్స్ నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి'

ప్రజాశక్తి-రామచంద్రాపురం:

స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రెవిన్యూ ఇన్స్పెక్టర్ కృష్ణమ్మ అన్నారు. సోమవారం మండలంలోని అనుప్పల్లి గ్రామంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరు బాధ్యతగా ఓటు వేయాలని తెలిపారు, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే అవకాశం ఒక్క ఓటుకు మాత్రమే ఉంటుందన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వో సిద్ధయ్య, వీఆర్ఏ గీత, సచివాలయ సిబ్బంది, బిఎల్వోలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

విద్యార్థికి కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:

ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకు, జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థి మౌనికను కలెక్టర్ షన్మోహన్ అభినందించారు. చిత్తూరు మున్సిపల్ కమిషనర్ అరుణ విద్యార్థిని దీవించి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. కాగా మౌనిక చిత్తూరు పట్టణంలోని శ్రీ విద్యావికాస్ జూనియర్ కాళాశాలలో ఎంపీసీ విభాగంలో చదివింది. 1000 మార్కులకు గానూ 991మార్కులు సాధించింది.

ఇండియా ఫోరంని గెలిపించుకుందాం

- అవకాశవాద రాజకీయాలకు బుద్ధి చెబుదాం
- తిరుపతి ఎన్నికల ప్రచారంలో ఇండియా ఫోరం నాయకులు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: సార్వత్రిక ఎన్నికల్లో 'ఇండియా' ఫోరం అభ్యర్థులను గెలిపించుకుందామని వైసీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ అవకాశవాద రాజకీయాలకు బుద్ధి చెబుదామని నేతలు పిలుపునిచ్చారు. ఇండియా ఫోరం ఎమ్మెల్యే అభ్యర్థి పి.మురళి, తిరుపతి పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ చింతామోహన్‌ను గెలిపించాలని కోరుతూ తిరుపతి నగరం జీవకోనలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథరెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చేసిందన్నారు. అభివృద్ధి శూన్యమన్నారు. జగన్ ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి తాడేపల్లె ప్యాలెస్‌ను కేంద్రంగా చేసుకుని నియంతృత్వ పోకడలతో పాలన చేస్తున్నారన్నారు. తమ సమస్యలు చెప్పుకోవడానికి ఎమ్మెల్యేలకు కానీ, ప్రజలకు కానీ ఆయన అవకాశం లేకుండా చేశారన్నారు. తిరుపతిలో సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ ఉమ్మడి అభ్యర్థిగా సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళిని నిలబెట్టామన్నారు. మురళి విజయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని హరినాథరెడ్డి కోరారు. ప్రధాన పార్టీలు డబ్బు సంచులతో అధికార పెత్తనంతో ప్రజల ముందుకు వస్తున్నాయన్నారు. వీరికి ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ దేశంలో బీజేపీ అరాచకాలు మితిమీరి పోతున్నాయన్నారు. దీనికి వ్యతిరేకంగా ఇండియా కూటమి ప్రజలందరినీ చైతన్యం చేసి దేశంలో రాజ్యాంగ పరిరక్షణ కోసం కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా ఏపీలో బీజేపీకి ప్రత్యక్షంగా పరోక్షంగా మద్దతు ఇస్తున్న పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ. రామానాయుడు, రాష్ట్ర సమితి సభ్యులు జనార్ధన్, జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, నగర కార్యదర్శి విశ్వనాథ్, సీపీఎం నగర కార్యదర్శి టి.సుబ్రహ్మణ్యం, సీపీఐ కార్యవర్గ సభ్యులు ఎన్.డి.రవి, ఎం.శివ, కేవై రాజా, పద్మనాభరెడ్డి, రామకృష్ణ, మంజుల, రత్నమ్మ, బండి చలపతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో ఇండియా ఫోరం నాయకులు

యోగాతో మానసిక ఆరోగ్యం: ముని మంజుల

ప్రజాశక్తి-క్యాంపస్: యోగాతో మానసిక ఆరోగ్యంగా ఉండవచ్చని యోగా థెరపిస్ట్ డాక్టర్ ముని మంజుల పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం 4, 19వ ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో సోమవారం యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యోగా థెరపిస్ట్ డాక్టర్ ముని మంజుల రిసోర్స్ పర్సన్‌గా ఉన్నారు. ఆమె మాట్లాడుతూ జంక్ ఫుడ్‌లను తగ్గించాలని, శారీరక రుగ్మతలను తగ్గించాలని ఉద్ఘాటించారు. దైనందిన జీవితంలోనే కాకుండా ఎలాంటి జఠిలమైన వ్యాధినైనా నయం చేయడంలో యోగా ప్రాముఖ్యతను ఆమె చెప్పారు. సైకలాజికల్ వెల్‌నెస్‌పై మరొక అవగాహన జరిగింది. దీని కోసం సైకాలజీ విభాగం అధ్యాపకులు డాక్టర్ గాయత్రి ఒకరి సానుకూలతను పెంచుకోవడం, మంచి లక్షణాలను కలిగి ఉండటం ద్వారా తనను తాను ఎలా సమతుల్యంగా ఉంచుకోవాలనే దానిపై దృష్టి పెట్టారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, ప్రొఫెసర్ ఎమ్.విద్యావతి విద్యార్థిలను ఉద్దేశించి ప్రసంగిస్తూ యోగా, శారీరక దృఢత్వం ద్వారా మానవుని సంపూర్ణ శ్రేయస్సుకు ప్రాముఖ్యతను ఇచ్చారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ సారా సరోజిని మాట్లాడుతూ ఫిజికల్ ఎడ్యుకేషన్ సౌకర్యాలను విద్యార్థులు సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 4వ యూనిట్‌కు చెందిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.సి.గాయత్రి, 19వ యూనిట్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.వి.భార్గవి రెడ్డిలు పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందించారు.

సర్టిఫికేట్లు, జ్ఞాపికలు అందజేస్తున్న ప్రొఫెసర్లు

అవసరమైన సమాచారాన్ని

సకాలంలో అందించాలి: జెసీ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:

సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల పరిశీలకులకు అవసరమైన సమాచారాన్ని సకాలంలో అందించాలని జాయింట్ కలెక్టర్, 172 చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం రిటన్నింగ్ అధికారి పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం జెసీ సమావేశ మందిరంలో ఎన్నికల పరిశీలకుల నియమించిన ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్, నోడల్ ఆఫీసర్ మధుసూదన్‌రెడ్డితో కలసి ఎన్నికల పరిశీలకుల నియమించిన లైజన్ ఆఫీసుర్లుతో సమీక్షించారు. జెసీ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పార్లమెంట్ నియోజకవర్గానికి, జిల్లాలోని 7అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి సాధారణ, ఎక్స్పెండచర్, ఎన్నికల పరిశీలకులకు అవసరమైన సమాచారాన్ని సకాలంలో అందించాలని లైజన్ ఆఫీసుర్లును ఆదేశించారు. ప్లాన్ ప్రకారం ముందుగానే లైన్ ఆఫీసర్లు వారి రోజువారి పర్యటన వివరాలను అడిగి తెలుసుకుని దాని ప్రకారంగా వారు ఎక్కడికి వెళ్లాలంటే అక్కడికి తీసుకు వెళ్లాలన్నారు. ఈ సమావేశంలో లైజన్ ఆఫీసుర్లు తదితరులు పాల్గొన్నారు.